





ప్రభుత్వ సలహాదారునిగా చాగంటి

స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కు అడ్వయిజర్‌గా నియామకం

కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ విభాగానికి సలహాదారుడిగా ప్రభుత్వం నియమించింది. నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా ఆయన ఈ పదవిని కేటాయిస్తూ కేబినెట్ హోదాను కల్పించారు. - వివరాలు 6లో



కుడా చైర్మన్‌గా తుమ్మల బాబు

ఆయనది పెద్దాపురం మండలం పులిమేరు

జనసేన నుంచి ఎంపిక

- వివరాలు 6లో

- కాకినాడ/ఆంధ్రజ్యోతి

అరచేతిలో అద్భుతమే, కానీ..





ఏదైనా మంచిగా ఉపయోగిస్తే మంచి.. చెడుగా ఉపయోగిస్తే చెడు.. సోషల్ మీడియా కూడా అంతే.. ఒక రకంగా చెప్పాలంటే అరచేతిలో అద్భుతమే మరి.. అనుకుంటే చాలు అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్‌కు శుభాకాంక్షలు చెప్పవచ్చు.. పీఎం మోదీని పలకరించవచ్చు.. సీఎం చంద్రబాబును కలవొచ్చు.. పవన్‌నూ కలవొచ్చు.. సమాజానికి ఏదైనా మంచి చేయాలనుకుంటే చాలంతే..! ఒక్కపోస్ట్ పెడితే చాలు వాళ్లే పిలుస్తారు మాట్లాడతారు.. ఎందుకంటే మన అరచేతిలో ఉన్నది అలీబాబా అద్భుత ప్రపంచమే.. ఇటువంటి సోషల్ మీడియాను కొందరు మంచికి ఉపయోగిస్తుంటే.. మరికొంత మంది తమ ఎదుగుదలకు ఉపయోగించుకుంటున్నారు.. ఇంకొంత మంది మాత్రం అవతల వారిని రెచ్చగొట్టే పోస్టులు పెట్టేందుకు ఉపయోగిస్తున్నారు.. అరచేతిలో ఉన్న అద్భుత ప్రపంచాన్ని చేతులారా నాశనం చేస్తున్నారు. అలా కాకుండా ఆ అద్భుతాన్ని ఆస్వాదిస్తే.. ఆనందలోకంలో విహరించవచ్చు.. అద్భుతాలను సృష్టించవచ్చు.

అదొక మాయా ప్రపంచం

- మంచికి మంచి.. చెడుకు చెడు
- అనవసర పోస్టులు పెడితే జైలే
- ఎదగాలన్నా అదే.. సేవకు అదే
- బంధాలను దగ్గర చేస్తుంది..
- స్నేహితులను పెంచుతోంది
- డిజిటల్ లైఫ్‌లో జీవనం
- పెరిగిన 'సోషల్' వినియోగం

సమాజంలో మంచీచెడూ సహజం. అలాగే ప్రతి విషయంలోనూ భిన్నాభిప్రాయాలు ఉంటాయి. వ్యక్తిగత ఇష్టాయిష్టాల నుంచి వ్యవస్థాగత అంశాల వరకు, గల్లీస్థాయి వ్యవహారం నుంచి అమెరికా ఎన్నికల తతంగం వరకు తెలుసుకోవడం, తెలిసిన విషయాలను ఇతరులతో పంచుకోవడం సాధారణంగా జరిగేదే. అయితే సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఒక సాంకేతిక విప్లవమే ఆవిష్కృతమైందనే చెప్పాలి. ఇప్పుడు నడుస్తున్నది డిజిటల్ లైఫ్. దశాబ్దం కిందట కేవలం ముఖపుస్తకం (ఫేస్‌బుక్) ప్రధాన వేదిక. తర్వాత బ్లాగ్స్, ఇన్‌స్టా, రీల్స్, యూట్యూబ్ ఇలా వివిధ మాధ్యమాల ద్వారా తమ అంతరంగాన్ని ఆవిష్కరించుకుంటున్నారు. గడిచిన ఆరేడేళ్లలో సోషల్ మీడియా కొత్త పుంతలు తొక్కింది. ఆయా మాధ్యమాల్లో అనేక సాంకేతిక సౌలభ్యాలు అందుబాటులోకి రావడం, అటు ఇంటర్‌నెట్ వేగంలోనూ పెనుమార్పులు రావడంతో మొత్తం సోషల్ మీడియా స్వరూపమే మారిపోయింది.

బంధాలను దగ్గరచేసి..

సరిగ్గా అయిదేళ్ల కిందట వరకూ సోషల్ మీడియాది చాలా పరిమితమైన పాత్ర. మిత్రుల జన్మదినం అయితే ఒక పోస్టు. ఎవరైనా కాలం చేస్తే ఒక రిప్. ఎక్కడికైనా వెళ్లి వస్తే ఫొటో సెషన్. ఇంకా గుడ్ మార్నింగ్‌లు.. పండుగలు పబ్బాలకూ శుభాకాంక్షల వెల్లువ. బంధాలను కలిపి ఉంచడానికి, దూరతీరాల్లో ఉన్నా అనుబంధాలను, పరిచయాలను, స్నేహాలను పదిలంగా కొనసాగించడానికి వచ్చిన అపూర్వమైన అవకాశం.తర్వాతర్వాత కొత్తపుంతలు తొక్కింది. విడివిడి మాధ్యమాలుగా ఉన్న ఈ సాంకేతిక వేదికలన్నీ విడ్డూరాలతో నడుస్తోంది. ఆ పరిమితులతోనే లైక్.. కామెంట్.. షేర్ ముచ్చట సాగేది. అపరిమితమైన భావ ప్రకటనా స్వేచ్ఛకు వేదికగానూ సోషల్ మీడియా ఉంది.

రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా..

సోషల్ మీడియా వేదికగా ఎందరో రాత్రికి రాత్రే హీరోలయ్యారు. అంతెందుకు రాజానగరం మండలం వడిశలేరు గ్రామానికి చెందిన రోజు కూలీ బేబీ సోషల్ మీడియా దెబ్బకు సెలబ్రిటీగా మారిపోయింది. మెగాస్టార్ చిరంజీవి వంటి వారి ప్రశంసలు అందుకున్న గాయనిగా నిలిచింది. ఎందరో కళాకారులు, ప్రతిభ చాటిన వారంతా సక్సెస్ బాట పట్టారు. వాట్సప్, ఫేక్‌బుక్ గ్రూపుల ద్వారా ఏర్పాటైన వేదికలు హాస్యాన్ని పంచుతున్నాయి.అనేక సేవలకూ అనుసంధానమై దారి చూపుతున్నాయి.గోదావరి జిల్లా పేరుతో హాస్యం, ఎటకారంతో పలు గ్రూపులు నడుస్తున్నాయి. ఇష్టమున్నా, లేకున్నా మనిషి జీవనంలో అనివార్యంగా మారిన ఈ బుల్లి మీడియాను ఎవరైనా అనుసరించాల్సిందే. లేదంటే వెనకబడిపోతాం.

తప్పుడు పోస్టుకు జీవితఖైదు!

సోషల్ మీడియాలో అసభ్య కామెంట్లు, పోస్టులు, మార్ఫింగ్ వీడియోలతో బాధితుల చావుకు కారణమైన వారికి భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 111(2)ఏ ప్రకారం మరణశిక్ష, లేదా జీవితఖైదు విధిస్తారు. రూ.10 లక్షలకు తక్కువ కాకుండా జరిమానా. ఒక్కసారి కేసు నమోదైతే ఉద్యోగాలు, పాస్‌పోర్టులు, వీసాలు లభించవు. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టేలా ప్రోత్సహించడం, సహకరించడం, ప్రయత్నించడం బీఎన్ఎస్ సెక్షన్ 111 (3)ప్రకారం తీవ్ర నేరం. దీనికి గరిష్ఠంగా ఐదేళ్ల జీవిత ఖైదు. రూ.5 లక్షల జరిమానా. అసభ్య పోస్టులతో దాడిచేస్తున్న వారిని పోలీసులకు చిక్కకుండా దాచిపెట్టినా, రక్షించినా నేరమే. దీనికి బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 111 (5) ప్రకారం మూడేళ్ల గరిష్ఠంగా జీవిత ఖైదు విధిస్తారు. ఫేస్‌బుక్‌లో సైతం పోస్ట్‌చేసే అంశాలపై అనేక నిబంధనలను ఆ సంస్థ విధిస్తోంది.



సోషల్ మీడియా ఎంత శక్తివంతమైనదో చెప్పడానికి ఈ ఒక్క సంఘటన చాలు.. రాజానగరం మండలం వడిశలేరులో రోజు కూలీగా పనిచేసుకునే ఒక మహిళ.. రాత్రికి రాత్రి గాయనిగా మారింది.. ఎంతలా అంటే మెగాస్టార్ చిరంజీవి మెచ్చుకునేటంత..

కాకినాడలో ఇలా..

సేవకు సోషల్ మీడియానే వేదికగా చేసుకుంటున్నారు.మనస్ఫూర్తి,సహాయ్ ఫౌండేషన్, సెర్వ్ నీడీ ఫర్‌ఏ చేంజ్ అంటూ ఫేస్‌బుక్ పేజీల ద్వారా నగరంలో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి మిగిలిన ఆహారాన్ని సేక రించి పేదలకు పంచుతున్నారు.పాత దుస్తు లను సైతం సేకరించి పేదలకు అందిస్తు న్నారు. కాకినాడ జాబ్ అప్‌డేట్స్ పేరుతో 4,600 మంది గ్రూపులో నిరుద్యోగులకు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు.ఐ లవ్ కాకినాడ పబ్లిక్ గ్రూప్ పేరుతో నగరంలో జరిగే సంగతులు అందరికీ చేరవేస్తున్నారు. ఇందులో 5,600 మంది సభ్యులు ఉన్నారు. కాకినాడ మారథాన్ పేరుతో ఓ సంస్థ ప్రత్యేక ఫేస్‌బుక్ పేజీ ద్వారా అందరికీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం అందిస్తోంది.



శ్రీయువసేన దత్తత తీసుకున్న తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు, విద్యార్థులు

సోషల్..కల్లోలం!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సోషల్ మీడియా.. ఇప్పుడీ పేరు మార్మోగిపోతోంది. వ్యక్తులు, పార్టీలు, కుటుంబాల పేరిట ఓ పక్షం లేనిపోనివన్నీ పోగేసి కల్పితాలను వ్యాపింపచేస్తూ సామాజిక కల్లోలం రేపుతోంది. కట్టుబాట్లు, నిబంధనలు, విలువలకు పాతరేసి తమ పక్షం ప్రయోజనాలే పరమావధిగా ఎదుటి వ్యక్తులను, కుటుంబాలను, ముఖ్యంగా మహిళల శీలాన్ని శంకిస్తూ సైతం సోషల్ మీడియా వేదికగా అబద్ధాలతో బజారుకీడుస్తోంది. దీనికి ఎన్నో ఉదాహరణలు గడచిన ఐదేళ్లలో ఉన్నాయి.

అక్కడ.. ఇదిగో ఇక్కడ..

2020లో పిఠాపురంలో దేవతామూర్తుల విగ్రహాలను అగంతకులు ధ్వంసం చేశారు. దీనిపై హిందూ సంఘాలు, భక్తులు ఆందోళనలో ఉన్న సమయంలో ఆ పక్కనే ఇంకో ఆలయంలోను ఇలాగే జరిగిందంటూ వేరే ఎక్కడో ధ్వంసమైన ఆలయాల ఫొటోలు తెచ్చి ఫేస్‌బుక్‌ల్లో ప్రచారం చేసి మత ఘర్షణలు సృష్టించే ప్రయత్నాలు కొందరు ఆకతాయిలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పిఠాపురం నుంచి పవన్ పోటీకి ఇంకా మొగ్గు చూపకముందే పవన్ కాకినాడ నుంచి పోటీ అని ఒకసారి, కాకినాడ ఎంపీగా అని మరోసారి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. పవన్ పిఠాపురం నుంచి పోటీచేస్తుండడంతో టీడీపీ నేత వర్మ పార్టీకి రాజీనామా చేశారంటూ దుష్ప్రచారాలు సోషల్ మీడియాలో చేపట్టారు. కొవిడ్‌లో జిల్లాలో వచ్చిన కేసులకంటే రెట్టింపు సంఖ్యతో లేనిపోని అలజడిని కొందరు ఆకతాయిలు సృష్టించి జనాలను భయపెట్టారు.

కాకినాడలో గతంలో పెద్దాపురంలో అంబటి ఒకే ఒక్క పేరుతో సోషల్ మీడియాగా అవతరించింది. వంటల దగ్గర నుంచి కొత్త సాంకేతిక విషయాల వరకు, సాహిత్యం మొదలుకొని సమస్తం తెలిపే సమాచారం వరకూ ఇప్పుడు సోషల్ మీడియానే తొలి వార్తగా చేరవేస్తోంది. ఫన్, వ్యంగ్య కార్టూన్లు, సాహిత్య విషయాలు, వింతలు ఆయిల్ పరిశ్రమ,కాకినాడలో టైకీ, ప్యారీ షుగర్స్ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు చనిపోయిన వారి సంఖ్యపై లేనిపోని భయాందోళనలు సృష్టించిన సంఘటనలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తనవద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసినట్టు పోలీసుల ఎదుట అంగీకరించారు. కానీ వైసీపీ మూకలు ఈ హత్యను అసలు అనంతబాబు చేయలేదంటూ,హత్య ఘటనపై రకరకాల విషవ్యాప్తి చేసి వేరే పార్టీలకు అంటగట్టే ప్రయత్నాలు చేసిన ఘటనలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో చిరుతపులి సంచరించిన సమయంలో కూడా ఫేక్ పోస్టులతో అటవీ అధికారులను..ఇటు ప్రజలను భయపెట్టారు. కాకినాడ జిల్లా పత్తిపాడులో పెద్ద పులి సంచారంపై కూడా ఇదే జరిగింది.

దూరమైన స్నేహితుడి కోసం.. శ్రీయువసేన

(ఆంధ్రజ్యోతి- సర్పవరం జంక్షన్)

కాకినాడలో వారంతా స్నేహితులు.. కలసిమెలసి చదువుకున్నారు. వీరిలో మార్నిస్వామి అనే దోస్త్ అనారోగ్యంతో చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈ స్నేహితుడికి గుర్తుగా 2013లో 30 మంది స్నేహితులతో కలసి శ్రీయువసేన సేవా సంఘాన్ని అధ్యక్షుడుగా డాక్టర్ బొల్లం సతీష్ ఏర్పాటు చేశారు. నిరుపేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, వైద్యం, జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నారు. రక్తం సేకరించి, నిరుపేదల ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు. తలసేమియా చిన్నారులను దత్తత తీసుకుని వీరికి అవసరమైన రక్తాన్ని అందిస్తూ చిన్నారుల జీవితంలో వెలుగులు నింపుతున్నారు. వేర్వేరు కారణాలతో తల్లిదండ్రులకు దూరమైన 78 మంది పిల్లలు, విద్యార్థులను దత్తత తీసుకుని గత నాలుగేళ్ల నుంచి పోషిస్తున్నారు.కొవిడ్‌తో తల్లిదండ్రులకు కోల్పోయిన 30 మంది విద్యార్థులను చదివిస్తున్నారు.

భిన్నంగా..

సోషల్ మీడియా ఓ సమాచార దర్శిని. ఓ మానసికోల్లాసాన్ని, విజ్ఞానాన్ని అందించేది. తెలియని సమాచారాన్ని తెలియజేసేది.

- రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు కర్రి రామారెడ్డి తన ఫేస్ బుక్ ద్వారా ఎన్నో విషయాలను పంచుకుంటూ ఉంటారు.కొంతకాలంగా 'అర్థం- పరమార్థం' పేరిట నిర్వహిస్తున్న వాడుకలో ఉన్న అనేక జాతీయాలను తనదైన శైలిలో వివరిస్తారు.
- కొవిడ్ సమయంలో కాకినాడకు చెందిన డాక్టర్ యనమదల మురళీకృష్ణ తన ఫేస్ బుక్ అకౌంట్‌లో విస్తృత స్థాయిలో వైద్య పరమైన సూచనలతో పాటు మెడిసిన్ వాడకాలను సూచించేవారు. అలాగే కొవిడ్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపడం విశేషం.
- కాకినాడకు చెందిన బొల్లోజు బాబా అధ్యాపకుడు. కవి, రచయిత కూడా. తన చారిత్రక పరిశోధనాంశాలతో అనేక వ్యాసాలు ఫేస్‌బుక్ వేదికగా విశ్లేషిస్తారు. ఆయన మెకంజీ కైఫీయతులు పేరిట రాసిన పుస్తకానికి సంబంధించి సోషల్ మీడియాలోనూ అనేక వ్యాసాలు అందించడం ద్వారా చారిత్రక అంశాలపై అవగాహన కల్పించారు.

జిల్లాలో నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులు

ఎంపికైన ఉపాధ్యాయులకు రేపు విజయవాడలో సన్మానం

కాకినాడ రూరల్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రాష్ట్ర స్థాయిలో సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించాల్సిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని అప్పట్లో వాయిదా వేశారు. అయితే ఈ కార్యక్రమాన్ని ఈనెల 11న విజయవాడ లబ్బీపేటలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సన్మానం చేస్తోంది. కాకినాడ జిల్లా పెదపూడి మండలం కాండ్రేగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌వినీల్, కిర్లంపూడి మండలం తామరాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సోషల్‌స్టడీస్‌లో స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.లక్ష్మీనారాయణ, కాకినాడ రేచర్లపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో తెలుగులో స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.గంగారాం, గాంధీనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.సూర్యభాస్కర్ ఎంపికయ్యారు.

ఉపాధి హామీతో పశువులకు రక్షణ

జిల్లావ్యాప్తంగా 675 పశువుల షెడ్లు

రూ.7కోట్ల 49 లక్షల నిధులు కేటాయింపు

ఉపాధిహామీ నిధులతో నిర్మాణాలు

ఇప్పటికే నాలుగు వందల షెడ్లు మంజూరు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పశువులకు రక్షణ కల్పించనున్నారు. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున పశువుల షెడ్లు నిర్మించనున్నారు. కాకినాడ జిల్లాలో 675 పశువుల షెడ్ల నిర్మాణాలకు సర్వంసిద్ధం చేశారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వాటిలో 400 వరకు షెడ్లు మంజూరు కూడా చేసేశారు. మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయి. ఒక్కొక్క పశువుల షెడ్ నిర్మాణానికి రూ.1.70 లక్షల నుంచి రూ.2.15లక్షలు నిధులు ఇస్తున్నారు. ప్రధానంగా ఇరవై మండలాల్లో వీటి నిర్మాణానికి కార్యాచరణ రూపకల్పన జరిగింది. దీనిలో గండేపల్లి, గొల్లప్రోలు, జగ్గంపేట, కాజులూరు, కాకినాడ రూరల్, కరప, కిర్లంపూడి, కోటనందూరు, పెదపూడి, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి, సామర్లకోట, శంఖవరం, తాళ్లరేవు, తొండంగి, తుని, యు.కొత్తపల్లి, ఏలేశ్వరరం మండలాలు ఉన్నాయి. దీనిలో పశువుల ఉన్న రైతులను గుర్తించి వారికి పశువుల షెడ్లను మంజూరు చేశారు. గేదెలు, ఆవులు, ఎద్దులు, దున్నపోతులు, మేకలు, గొర్రెలు, కోళ్ల ఉన్నవారికి ఈ నిధులు ఇస్తున్నారు. పశువుల షెడ్లను సిమెంట్ స్తంభాలతో రక్షణ గోడలతో అత్యంత కట్టుదిట్టంగా నిర్మించేందుకు అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. మండలానికి 25 నుంచి 50 వరకు షెడ్లు కేటాయించారు.

పశువుల ఆరోగ్యంతో అధిక దిగుబడి

పశువులశాలలను నిర్మించడం వల్ల పశువులు ఆర్యోగంగా ఉండి అధికంగా పాల ఉత్పత్తులను ఇస్తాయని అధికారులు చెబుతున్నారు. పశువుల శాలల్లో పశువులను ఉంచడానికీ, పచ్చగడ్డి ఎండు గడ్డి సమయానికి వేయడానికి అవకాశం ఉంటుంది. పైగా పెద్ద నీళ్లకుండీని ఏర్పాటుచేసి పశువులు దాణా పెట్టడానికి ఆస్కారం ఉంది.

వర్షాకాలంలో అనేక ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా వర్షాకాలంలో తడవకుండా పశువులను కట్టేందుకు పశువులశాలలు లేకపోతే రైతన్న అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో విద్యుత్తు సరఫరా లేనప్పుడు పశువుల వద్దకు వెళ్లి పాల సేకరణకు మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పైగా పశువుల షెడ్లు లేకపోతే వర్షాకాలంలో పశువులు రాత్రింబవళ్ల తడిసిపోయి అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇక నుంచి ఈ సమస్యలు లేకుండా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో గత టీడీపీ హయాంలోనే ఈ షెడ్ల ఏర్పాటును చేపట్టింది. అదే తరహాలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా పెద్దఎత్తున పశువులశాలలను నిర్మించాలని నిర్ణయించి అమలుచేస్తోంది.

కనుమ పండుగకు అందుబాటులో

జిల్లాలో పశువుల షెడ్ల నిర్మాణాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాం. వచ్చే ఏడాది జనవరిలో కనుమ పండుగకు వీటిని అందుబాటులోకి తెస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేస్తాం. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువుల షెడ్ల కొరతను తీర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

- అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ

శాస్త్రీయ విజ్ఞానమే ప్రపంచ శాంతికి మూలం

- వివరాలు 6లో

తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్

నేడు జయంతి

- కథనం 6లో





వేళంగిలో పాల కావడి ఊరేగింపు.. అభిషేకం

వేళంగిలో పాల కావిడి ఉత్సవం

కరప, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళంగి గ్రామంలో శనివారం పాల కావిడి ఉత్సవాన్ని అయ్యప్పస్వామి మాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళనాడులోని పళని సుబ్రహ్మణ్యస్వామికి నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఇక్కడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కన్నుల పండువగా జరిపారు. స్థానిక వ్యాపారవేత్త బదిరెడ్డి వెంకన్నస్వామి వీరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 508 మంది అయ్యప్పస్వాములు పాల కావిడిలను భుజాలకెత్తుకుని గ్రామోత్సవం నిర్వహించారు. దేవతామూర్తుల వేషధారులు, బాలికల కోలాటాలు, చండామేళ వాయిద్యాల నడుమ అయ్యప్ప భక్తులు పాల కావిడిలతో ఊరేగి తుల్యభాగ నదీతీరాన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామిని ఆ పాలతోపాటు పువ్వులు, విబూది, ఇతర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఎస్.కుమార్‌వేల్ గురుస్వామి, డి.మాధవకృష్ణ గురుస్వామి, అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు చాగంటి సూరిబాబు తదితరులు మహాగణపతి హోమం, అయ్యప్పస్వామి అష్టోత్తరపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించి పంచహారతులిచ్చారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన నేత చిక్కాల దొరబాబు, ఇతర ప్రజా ప్రతినిధులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్

నేడు జయంతి సందర్భంగా..



(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం సిటీ)

తీయనైన తెలుగు భాషను పునర్జీవింపజేసిన వారిలో ప్రథముడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఆయన తెలుగు అధ్యయనాలకు ఎనలేని కృషిచేశారు. తెలుగువారే తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గించుకుంటూ పయనిస్తున్న సమయంలో యూరోపియన్ పండితుడుగా ఉన్న చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకుని తెలుగుకు జీవం పోశారు. కలకత్తాలో మిషనరీలో సంస్కృతి పండితుడిగా పనిచేస్తున్న డేవిడ్ బ్రౌన్ దంపతులకు 1798 నవంబరు 10న సీపీ బ్రౌన్ జన్మించారు. తన తండ్రి ద్వారా సంస్కృతం, హిందుస్తానీ, పర్షియన్ నేర్చుకున్నారు. అటుపై ఇంగ్లాండులో హేలీబరీ కాలేజీలోను, భారతదేశంలో మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలోను బ్రౌన్ చదివారు. ఆ రోజుల్లోనే ఆయన తెలుగు, మరాఠీ భాషలను నేర్చుకున్నారు. తెలుగు భాషపై ఎనలేని మక్కువను పెంచుకున్న బ్రౌన్ అప్పట్లో ఈస్ట్ ఇండియా కంపెనీలో చేరారు. కడపలోని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు అసిస్టెంట్‌గా నియమితుడయ్యారు. అప్పటి కలెక్టర్ జాన్‌హన్‌బరీ భాషపై నిష్ణాతుడు కావడంతో అతని ద్వారా ప్రేరణ పొంది తెలుగు భాషను పూర్తిగా నేర్చుకున్నారు. తన జీవితంలో తెలుగు భాస అధ్యయనం కోసం తన సమయాన్ని అంతా కేటాయించి తెలుగు తాళపత్ర వ్రాత ప్రతులను సేకరించారు. వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. నలచరిత్రను, ఆంధ్రమహా భారతం, శ్రీమద్భాగవతాలను ప్రచురించారు. తెలుగు నేర్చుకునే వారికోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాశాడు. ఆయన కృషితోనే నేడు బ్రౌన్ డిక్షనరీ కూడా ఉంది. వసు చరిత్ర, మనుచరిత్ర, పలనాటి వీరచరిత్ర ప్రచురించాడు. ఆయనకు తెలుగు సూర్యుడు అనే బిరుదు కూడా ఉంది. తెలుగుకు ఎంతో సేవలందించిన బ్రౌన్ జన్మదినం నేడు.

రాజమహేంద్రవరంలో బ్రౌన్ మందిరం





సీపీ బ్రౌన్ మందిరం.. నిర్వాహకులు, ప్రాణహిత కవి సన్నిధానం నరసింహ శర్మ

తెలుగుభాషా వికాసానికి, భాషావేత్తలను సత్కరించేందుకు, తెలుగు ఘనత చాటేందుకు రాజమహేంద్రవరంలో సీపీ బ్రౌన్ మందిరం ఏర్పడింది. బ్రౌన్ మందిరం వేదికగా తెలుగు భాష పరిపుష్టి కావాలని భావించి ప్రాణహిత కవి సన్నిధానం నరసింహశర్మ, సీనియర్ జర్నలిస్టు, ఆయన సోదరుడు సన్నిధానం శాస్త్రి సంయుక్త నిర్ణయంతో వారి ఇంటినే బ్రౌన్ మందిరంగా మార్చేశారు. తెలుగుభాషకు ప్రాణప్రతిష్ట చేసిన బ్రౌన్ అంటే ఎంతో ఇష్టంతో వారు ఈ పేరు పెట్టుకున్నారు. అప్పటి నుంచి ఎందరో ప్రముఖులు ఈ ఇంటి కార్యక్రమాలకూ తరలి వస్తున్నారు. ఎలాంటి హంగూఆర్భాటాలూ లేకుండా తెలుగుభాషకు పట్టంగట్టే వారందరినీ ఇక్కడ సముచితరీతిలో సత్కరిస్తున్నారు. 2003 మే 4న ఈ సత్కారానికి పద్మశ్రీ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తోనే శ్రీకారం చుట్టారు. ఒక ఇంటికి ఈవిధంగా బ్రౌన్ పేరుపెట్టడం మరెక్కడా లేదు. భాషాభివృద్ధి కార్యక్ర మాలకు తమ ఇంటికే ఒక వేదికగా చేసిన ఈ ఇద్దరి సోదరులను ప్రశంసించని వారు లేరు. దాంతో రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మందిరం అంటేనే తెలుగు భాష గుర్తుకువచ్చేలా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న రచయితలు, భాషాభిమానులు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రాజమహేంద్రవరం వస్తే బ్రౌన్ మందిరాన్ని సందర్శించే సంప్రదాయం కొనసాగుతోంది. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తోపాటు గొల్లపూడి మారుతీరావు, గజల్ శ్రీనివాస్, తుర్లపాటి కుటుంబరావు, మాడుగుల నాగఫణిశర్మ, గోరటి వెంకన్న, జేడీ లక్ష్మీనారాయణ, దర్శకులు మాదవపెద్ది సురేష్, చిన్మయి తమ్మారెడ్డితోపాటు గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, పింగళి వెంకయ్య వారసులు సీపీ బ్రౌన్ మందిరాన్ని సందర్శించారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న నరసింహశర్మకు జీవన సాఫల్య పురస్కారం, సన్నిధానం శాస్త్రికి గిడుగు రామ్మూర్తి స్మారక పురస్కారం లభించింది. సోదరులిద్దరూ సీపీ బ్రౌన్ స్ఫూర్తిని నేటికీ కొనసాగిస్తున్నారు.



ప్రపంచ వ్యాధి నివారణ టీకా దినోత్సవం

టీకా.. ఆరోగ్యానికి భరోసా!

చిన్నారులకు వరం 'వ్యాధి నిరోధక' టీకాలు.. వ్యాక్సిన్లతో రోగాలు దూరం


రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన వ్యాధులకు భరోసాగా ప్రస్తుతం అనేక టీకాలు అందుబాటులోకి వచ్చాయి. నిజానికి టీకాలు తయారయ్యేది ఆయా వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మక్రిములతోనే అన్న విషయం చాలామందికి తెలియదు. ఒక వ్యాధిని నిర్మూలించడానికి ఆ వ్యాధికి కారణమయ్యే సూక్ష్మక్రిమిని అతి తక్కువ మోతాదులో శరీరంలోకి పంపి దానికి రోగ నిరోధకశక్తిని పెంపొందించడమే వ్యాక్సిన్లలోని సూత్రం. ఒకసారి శరీరంలో ఒక వ్యాధికి సంబంధించిన సూక్ష్మక్రిములను ఎదుర్కొనే యాంటీబాడీస్ తయారైతే భవిష్యత్తులో ఆ వ్యాధిని నిరోధించడంలో రోగ నిరోధకశక్తి తేలిగ్గా విజయం సాధిస్తుంది. క్షయ, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, గవదబిళ్లలు. రుబెల్లా, న్యుమోనియా, కామెర్లు, పోలియో, విరేచనాలు.. ఇలా పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేసే ఎన్నో రకాల జబ్బులకు రోగాలకు వ్యాక్సిన్లతో అడ్డుకట్ట వేయవచ్చు. నిజానికి పిల్లలకు తొలి టీకా తల్లిపాలే అని వైద్యులు చెబుతుంటారు. బిడ్డ పుట్టినప్పటి నుంచీ చేపట్టే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చిన్నారులకు ఒక వరం. జాతీయ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం జరుగుతోంది. గర్భిణీలకు గర్భిణీ సమయంలో ధనుర్వాతం రాకుండా రెండు డోసులు టీడీ వ్యాక్సిన్ ఇస్తారు. నెలరోజుల వ్యవధిలో వీటిని ఇస్తారు. ఆ తర్వాత బిడ్డ పుట్టిన తొలిరోజున బిడ్డకు హెపటైటిస్ -బి వ్యాక్సిన్ ఇస్తారు. బిడ్డ పుట్టిన 24 గంటల్లోనే దీన్ని వేయాల్సి ఉంటుంది. బిడ్డ పుట్టిన తర్వాత 15 రోజుల లోపు పోలియో వ్యాధి రాకుండా ఓరల్ పోలియో చుక్కలు వేస్తారు. నెల రోజుల లోపు టీబీ వ్యాధి రాకుండా బీసీజీ టీకా వేస్తారు. బిడ్డకు ఆరు వారాలకు మొదటి డోసుగా... ఓరల్ పోలియో, పెంటావాలెంట్ వ్యాక్సిన్, రోటా వ్యాక్సిన్, ఐపీవీ, పీసీవీ వ్యాక్సిన్లు ఇస్తారు. అలాగే పది వారాలకు వీటినే రెండో డోసుగా ఇస్తారు. 14 వారాలకు మూడవ డోసు వేస్తారు. బిడ్డకు తొమ్మిది నెలలకు మీజిల్స్ రెబెల్లా మొదటి డోసు, ఐపీవీ, పీసీవీ బూస్టర్ డోసులు, విటమిన్-ఏ ద్రావణం మొదటి డోసు వేస్తారు. బిడ్డకు 16-24 వారాలకు మీజిల్స్ రుబెల్లా రెండవ డోసు, డీపీటీ మొదటి డోసు వేస్తారు. వీటితోపాటు ఓపీవీ బూస్టర్ డోసులు, విటమిన్ - ఏ ద్రావణం రెండవ డోసు వేస్తారు. బిడ్డకు ఐదు సంవత్సరాలకు డీపీటీ బూస్టర్ డోసు వేస్తారు. 10 సంవత్సరాలకు ఒక డోసు టీడీ వ్యాక్సిన్ వేస్తారు. వ్యాధి నిరోధక కార్యక్రమంలో మొత్తం 12 రకాలైన వ్యాక్సిన్‌లు ఉపయోగిస్తారు. పిల్లలకు ఎలాంటి ప్రాణాపాయ సమస్యలు రాకుండా దాదాపుగా అన్ని వ్యాధులకు ఈ టీకాలు ఉన్నాయి. విటమిన్ -ఏ ద్రావణాన్ని ఆరు నెలలకు ఒకసారి 9నెలల నుంచి 60నెలల దాకా వేస్తారు.

వ్యాక్సిన్ల షెడ్యూలు ఇలా...

జిల్లాలో వ్యాక్సినేషన్ షెడ్యూలు ఇలా ఉంటుంది. గర్భిణీలకు, ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ చేస్తారు. నెలలో ప్రతి బుధవారం, శనివారం అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అంగన్వాడీ సెంటర్లు, గ్రామసచివాలయాల్లో వ్యాక్సిన్లు వేస్తారు. ప్రతి వ్యాక్సినేషన్ సెషన్‌ను ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త నిర్వహిస్తారు. జిల్లాలో ప్రతి నెలా 1143 వ్యాక్సినేషన్ సెషన్లు జరుగుతాయి. ప్రతి నెలా కొత్తగా 2330 మంది గర్భిణీలకు, 2060 మంది చిన్నారులకు వ్యాక్సినేషన్ చేస్తారు. ఈ ఏడాది అక్టోబరు నెలనాటికి 13,023 మంది పిల్లలకు వ్యాక్సినేషన్ వేయడం జరిగింది. రాజమహేంద్రవరం జీజీహెచ్‌తో సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఒక నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ జరుగుతుంది.

చిన్నారులకు రక్ష.. వ్యాక్సినేషన్

0-5 ఏళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి వారికి ఎలాంటి వ్యాధులు సోకకుండా ముందుజాగ్రత్తగా వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుంది. హైరిస్క్ ఏరియాలను ముందుగానే గుర్తించి అక్కడ పిల్లలకు వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని తూర్పుగోదావరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.



శాస్త్రీయ విజ్ఞానమే ప్రపంచ శాంతికి మూలం

నేడు శాంతి, అభివృద్ధి కోసమే ప్రపంచ సైన్స్ దినోత్సవం

జేఎన్టీయూకే, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రజల రక్షణ, సంక్షేమం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 1997లో యునెస్కో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ బుడాపెస్ట్‌లో మొట్టమొదటి ప్రపంచ శాస్త్రీయ సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో సైన్స్ సమాజానికి అవగాహన కల్పించాల్సిన అవసరముందని పలువురు ప్రతినిధులు అంగీకరించారు. ఈ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం ద్వారా సైన్స్ కోసం ఒక ప్రత్యేక రోజు లేదా వారాన్ని అంకితం చేయాలని ఒక ఏడాది తరువాత యునెస్కో ఎగ్జిక్యూటివ్ బాడీ శాంతి అభివృద్ధికోసం ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని ఆమోదించింది. దీనిని నవంబరు 10న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవాల్సి ఉంది. 2001లో శాంతి అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం అనేక ప్రాజెక్టులు కార్యక్రమాలు, నిధులను రూపొందించింది. 2002 నవంబరు 10న శాంతి, అభివృద్ధి కోసం మొదటి ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు. సైన్సు ప్రజల జీవితాన్ని మెరుగుపరచడంలో ఎలాంటి కీలక పాత్ర పోషిస్తుందో అర్థంచేసుకోవడానికి ప్రజలకు సహాయపడే రోజు ఇది. ఐక్యరాజ్య సమితి 2030 సుస్థిరాభివృద్ధి అజెండాలో విద్య, వాతావరణం, లింగ సమానత్వం నుంచి సుస్థిరాభివృద్ధి వరకూ సుమారు 17 ప్రపంచ లక్ష్యాలున్నాయి. ప్రపంచ సైన్స్ దినోత్సవం సమాజంలో సైన్స్ ముఖ్యమైన పాత్రను, స్థిరమైన సమస్యలపై చర్చలతో విస్తృతంగా ప్రజలను నిమగ్నంచేయాల్సిన అవసరాన్ని తెలియచేస్తుంది. ఇది మన దైనందిన జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను నొక్కిచెబుతుంది.

సైన్స్‌తోనే అభివృద్ధి

మన జీవితంలో సైన్స్ అనేది లేకపోతే అభివృద్ధి అనేదే లేదు. అంతే కాకుండా ప్రపంచ దేశాలన్నీ ఈరోజు ప్రతీ రంగంలోనూ అభివద్ధి పథంలో నడుస్తున్నాయంటే అది సైన్స్‌తోనే సాధ్యమవుతున్నది. ప్రాచీన కాలం నుంచి నేటి వరకూ జరిగిన అభివృద్ధి అంతా సైన్స్ ద్వారానే సాధించాం. అంతే కాకుండా ఆధునిక సాంకేతికత, పరిశోధనలకు కూడా ఉపయోగపడేది సైన్స్ మాత్రమే. ఒకరకంగా చెప్పాలంటే సైన్స్ లేనిదే మానవ మనుగడనేది లేదు.

మేడమ్ క్యూరీ తన పరిశోధనకు పేటెంట్ తీసుకోలేదు



సైన్స్ మానవులందరిదీ. దాని ద్వారా అందరూ లబ్ధిపొందుతారు.అంతే కానీ ఏ ఒక్కరిదీ కాదు. అందుకే రెండుసార్లు నోబెల్ బహుమతి సాధించిన మేడమ్ క్యూరీ తాను చేసిన పరిశోధనకు పేటెంట్ హక్కు తీసుకోలేదు. అంతేకాదు విద్యార్థులు సైన్స్‌లో పూర్వం మాదిరిగా రాణించకపోవడానికి కారణం చేతితో సమస్యను పరిష్కరించడం మానేసి జవాబులు చదువుతున్నారు. విద్యార్థుల్లో మార్పు వస్తేనే సైన్స్ అభివృద్ధి చెందుతుంది. శాస్త్రీయ దృక్పథంతోనే పురోగతి సాధ్యం.

- ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, జేఎన్టీయూకే, ఉపకులపతి

రుడా ఛైర్మన్‌గా బీవీఆర్ చౌదరి

రాజమహేంద్రవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (రుడా) ఛైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్‌నేత బొడ్డు వెంకటరమణచౌదరి (బీవీఆర్ చౌదరి) నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈయన ప్రస్తుతం రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన తండ్రి బొడ్డు భాస్కరరామారావు తెలుగుదేశం పార్టీలో కీలకనేతగా ఉండేవారు. రెండుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వెంకటరమణ చౌదరి 2014 ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. తర్వాత కొద్ది రోజులు మౌనంగా ఉండి తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్నికలకు ముందు రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి పార్టీని బలోపేతం చేశారు. గత ఎన్నికల్లో ఆయనకే ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని.. సుమారు 30 ఏళ్లపాటు ఆయన ఇక్కడ రాజకీయం చేస్తారని ఎన్నికల ముందు చంద్రబాబు కోరుకొండ సభలో ప్రకటించారు. తర్వాత జనసేన, బీజేపీతో పొత్తు కారణంగా చాలా మంది ఎమ్మెల్యే టిక్కెట్లను త్యాగం చేయవలసి ఉంది. వీరిలో వెంకటరమణ ఒకరు. గత ఎన్నికలలో రాజానగరం నుంచి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ విజయం సాధించడానికి వెంకటరమణ చాలా కృషి చేశారు. ఎట్టకేలకు ఆయన కష్టానికి ఫలితం దక్కింది. ఉన్నత విద్యావంతుడైన వెంకటరమణ చౌదరి బిట్స్ పిలానీ నుంచి మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. యుటి డల్లాస్ డెవలప్‌మెంట్ అథార్టీలలో ముఖ్యమైనది రుడా. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇది 2021లో ఏర్పడింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలను కలుపుతూ గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (గుడా)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథార్టి (రుడా) సెపరేటుగా ఏర్పడింది. దీని పరిధి రాజమహేంద్రవరం డివిజన్, కొవ్వూరు డివిజన్‌తో పాటు, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొంతవరకూ విస్తరించి ఉంది. రుడాకు వెంకటరమణ మూడో ఛైర్మన్. మొదటి ఛైర్మన్‌గా మేడపాటి షర్మిళారెడ్డి, రెండో ఛైర్మన్‌గా రౌతు సూర్యప్రకాశరావు పనిచేసిన సంగతి తెలిసిందే.

చంద్రబాబు నాకిచ్చిన మంచి అవకాశం



రుడా ఛైర్మన్‌గా అవకాశం [illegible] పదవి వల్ల కొందరికి వన్నె వస్తుంది. కొందరి వల్ల పదవులకు వన్నె వస్తుంది. రుడా నిబంధనలు, పరిధి అవగాహన చేసు కుని రుడాకు గుర్తింపు తెస్తా. త్వరలో ముహూర్తం చూసుకుని బాధ్యతలు స్వీకరిస్తాను.

బొడ్డు వెంకటరమణ చౌదరి, రుడా ఛైర్మన్

అమలాపురాన్ని అభివృద్ధి చేస్తా

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు





స్వామినాయుడును అభినందిస్తున్న టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి రమణబాబు

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన అల్లాడ స్వామినాయుడును నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా పేరొందిన స్వామినాయుడు పడిన కష్టానికి ఫలితం లభించిందని పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షుడిగా, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో కొనసాగుతున్నారు.

కోనసీమ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తా : అల్లాడ

కోనసీమ ప్రాంతంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో కృషి చేస్తాను. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి మంజూరయ్యే నిధులతో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తా. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రణాళికా విభాగాల్లో లేఅవుట్‌లు, ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి అక్రమాలు లేకుండా చర్యలు తీసుకుంటా. విచ్చలవిడిగా పెరిగిపోతున్న లేఅవుట్లలోని అక్రమాలను గుర్తించి ప్రజలు నష్టపోకుండా వారిని చైతన్యవంతుల్ని చేస్తాం. అవినీతిని ప్రక్షాళన చేస్తా. నాకు ఇంతటి కీలకమైన పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నేత ఎంపిక

గతంలో శెట్టిబలిజ సాధికార కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన కుడుపూడి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నేత కుడుపూడి సత్తిబాబు నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం శనివారం వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించింది. ఇందులో శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ ఛైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు పేరును ఖరారు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కుడుపూడి సత్తిబాబు సుదీర్ఘకాలం పాటు టీడీపీలో సేవలందించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసులను అక్రమంగా అరెస్టు చేసిన సమయంలోను కుడుపూడి సత్తిబాబు రాజమహేంద్రవరంలో ఉద్యమించారు. ఈ నేపథ్యంలో సత్తిబాబుకు టీడీపీ అధినాయకత్వం గుర్తింపునిచ్చి ఛైర్మన్‌గా నియమించింది. సత్తిబాబు నియమకం పట్ల సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా.


ఛైర్మన్ పదవి రావడానికి కారకులైన అందరికీ కృతజ్ఞతలు. తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా. కూటమి ప్రభుత్వ సహకారంతో శెట్టిబలిజల అభివృద్ధికి పాటుపడతా.నన్ను గుర్తించిన పార్టీకి రుణపడి ఉంటా.

కుడిపూడి సత్తిబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్

ప్రభుత్వ సలహాదారునిగా చాగంటి కోటేశ్వరరావు

స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కు అడ్వయిజర్‌గా నియామకం

కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు



సర్పవరం జంక్షన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కి సలహాదారుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా కాకినాడ రూరల్ మం డలం తిమ్మాపురానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికకర్త చాగంటి కోటేశ్వరరావును స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కి సలహాదారుడిగా నియమించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఏకధాటిగా 42 రోజులపాటు సంపూర్ణ రామాయణం, 42 రోజులపాటు భాగవతం, 30 రోజుల్లో శివ పురాణం, 40 రోజులపాటు లలితా సహస్రనామ స్తోత్రాన్ని అనర్గళంగా ప్రవచించి పండితులు, పామరుల మనసులను విశేషంగా ఆకట్టుకున్నారు.


ఇదీ చాగంటి నేపథ్యం: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో చాగంటి సుందర శివరావు, సుశీలమ్మ దంపతులకు 1958 జూలై 14న కోటేశ్వరరావు జన్మించారు. కోటేశ్వరరావుకు భార్య సుబ్రహ్మణ్యేశ్వరి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏలూరులో ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. విశాఖలో డిగ్రీతో పాటూ పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేశారు. మల్లంపల్లి అమరేశ్వర ప్రసాద్ వద్ద సంస్కృతం చదివారు. కాకినాడలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో ఆకొండి లక్ష్మీస్మారక గోశాల ప్రాంగణం లో గోశాలను ఏర్పాటు చేశారు. గోశాల సమీపంలోనే ఇల్లు నిర్మించుకుని ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం కంచి కామకోటి పీఠాధిపతి, జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో 39వ చాతుర్మాస్య దీక్ష ఏర్పాటు చేసి 60 రోజులపాటు దిగ్విజయంగా జరిగేలా కృషి చేశారు. ఎఫ్‌సీఐ లో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూనే సెలవు రోజుల్లో ఆధ్యాత్మిక ప్రచనాలు చేసేవారు. హిందూ, సనాతన ధర్మంపై అనేక ప్రవచనాలు చేయడంతో పాటూ అనేక పుస్తకాలు రాసి ప్రచురించారు. వీటిలో రామాయణం, భాగవతం, శివమహాపురాణం, కార్తీకమాస వైభవం, తిరుమల విశిష్టత, శంకర విజయం, దుర్గా వైభవం, దేవీ నవరాత్రులు, శివస్తోత్రం, దశావతారాలు, గోమాత వైభవం, కామాక్షీ వైభవం, శృంగేరి జగద్గురువు వైభవం, పంచనాడీ వైభవం, అరుణాచల మహత్యం, సుబ్రహ్మణ్య వైభవం, లలిత సహస్రనామస్తోత్రం, సౌందర్య లహరి ఆది శంకరాచార్య రామాయణం, ధర్మం, రుక్మిణి కల్యాణం తదితర పుస్తకాలు రచించారు.

అందుకున్న బిరుదులు: సెప్టెంబరు 2012లో కంచి కామకోటి పీఠం చాగంటికి ప్రవచన చక్రవర్తి బిరుదు ప్రదానం చేసింది. డిసెంబరు 2012లో శృంగేరి శారదా పీఠం చాగంటికి ప్రవచన రత్నాకర అవార్డుతో సత్కరించింది. డిసెంబరు 2013లో సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిష్ఠాత్మక నేషనల్ ఎమినెన్స్ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ప్రదానం చేశారు. తిరుపతిలో మార్చి 2014లో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం గౌరవ డాక్టరేట్ వాచస్పతితో సత్కరించింది. మార్చి 2015లో ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రామినెంట్ సత్కారం

మార్చి 2016లో రాష్ట్ర ప్రభుత్వం దుర్ముఖి ఉగాదినాడు కళారత్న (హంస) బిరుదు ప్రదానం చేసింది. ఆగస్టు 2021లో విజయవాడ కేఎల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ డి. లిట్ ప్రదానం చేసింది. నవంబరు 2022లో గురజాడ సాహిత్య సమైక్య గురజాడ పురస్కారంతో సత్కరించింది ఇవే కాకుండా శారదా జ్ఞానపుత్ర, వాచస్పతి పురస్కారం, పిన్నమనేని పురస్కారం, కళారత్న పురస్కారం, ఉపన్యాస చక్రవర్తి తదితర పురస్కారాలను అందుకున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం చాగంటిని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ సలహాదారునిగా నియమించగా, ఈ పదవిని తీసుకునేందుకు ఆయన ఇష్టపడలేదు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ఆత్రేయపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక శనివారం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో వాడపల్లి కిక్కిరిసిపోయింది. సుమారు 50 వేల నుంచి 60వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా వేస్తున్నారు. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు జరిపి మొక్కులు చెల్లించారు. రాత్రి వివిధ సాం స్కృతిక ప్రదర్శనలు జరిగాయి. సుమారు 30 నుంచి 35వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు అంచనా. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, బాలభోగం, ఐశ్వర్యలక్ష్మి హోమం తదితర అర్జిత సేవలు నిర్వహించి స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.53 లక్షలు రికార్డుస్థాయిలో లభించినట్టు ఉపకమీషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కుడా ఛైర్మన్‌గా తుమ్మల బాబు



పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్‌గా కాకినాడ జిల్లా పెద్దాపురం మండల పులిమేరు గ్రామానికి చెందిన తుమ్మల రామస్వామి (బాబు) నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండవ జాబితాలో తుమ్మల బాబుకు చోటు దక్కడంతో ఆయన స్వగ్రామం పులిమేరుతో పాటు పెద్దాపురం నియోజకవర్గంలో జనసేన శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రస్తుతం బాబు జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడిగా కొసాగుతున్నారు. గడచిన కాలంలో ఆయన పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యువరాజ్యం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. పార్టీ పట్ల నిబద్ధత, విధేయత కలిగిన నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. అలాగే పవన్ కల్యాణ్‌తో మంచి సాన్నిహిత్యం ఉండడం ఆయనకు బాగా కలిసి వచ్చింది. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన జనసేన పార్టీ నుంచి పెద్దాపురం టికెట్ వస్తుందని ఆశించారు. కూటమి అంశం తెరమీదకి రావడంతో ఆ సీటు చివరి నిముషంలో నిమ్మకాయల చినరాజప్పకు దక్కడంతో ఆయన ఒకింత అవేదనకు గురయ్యారు. మళ్లీ జనసేన అధిష్టానం పిలిచి మాట్లాడంతో ఆయన పెద్దాపురంలో కూటమి అభ్యర్థిగా ఉన్న చినరాజప్ప విజయానికి విశేంగా కృషిచేయడమే కాకుండా ఆయన గెలుపునకు కీలకమయ్యారు. నాడు చేసిన త్యాగానికి ఆయనకు కుడా ఛైర్మన్ పదవి దక్కడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనను కుడా ఛైర్మన్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు.


అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీసిద్ధివినాయకుడి ఆలయం కిటకిట

అయినవిల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, అన్నపూర్ణాదేవి సమేత వీరేశ్వరస్వామి, ముక్తికాంత క్షణముక్తీశ్వరాలయం, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. అయినవిల్లిలో రహదారులు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.


దేవస్థానం ఈవో, ఇంజనీరింగ్ అధికారులతో ట్రయల్‌రన్

విజయవంతంగా పంటు ట్రయల్‌రన్

అన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న సత్యదేవుడి తెప్పోత్సవం సందర్భంగా సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లు పంపా సరోవరంలో విహరించే హంసవాహన పంటుకు శనివారం ట్రయల్‌రన్ నిర్వహించగా విజయవంతమయింది. ఈవో రామచంద్రమోహన్, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. హంసవాహనంపై కేవలం వైదికబృందం మాత్రమే అనుమతిస్తామని ప్రముఖుల కోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. రెండురోజుల్లో పంటును హంస వాహనంగా తీర్చిదిద్దుతారని ఈవో పేర్కొన్నారు.

ఇసుక రగడ


గోపాలపురం ఇసుక ర్యాంపు వద్ద వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ శేఖర్‌బాబు

- ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య వాగ్వివాదం
- ఇతర మండలాల వారికి ఎగుమతులు లేవంటున్న స్థానికులు
- వెస్ట్ గోదావరి వాహనాలకు ఎందుకు లోడ్ చేయరంటూ నిరసన
- జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు
- తాత్కాలికంగా ర్యాంపు మూసివేత
- స్థానికులు మాత్రమే ఇసుక తరలించుకోవాలి: తహశీల్దారు ముక్తేశ్వరరావు

రావులపాలెం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానం రావులపాలెం మండలం గోపాలపురం ఇసుక ర్యాంపులో అమలు చేస్తుండగా ఇక్కడి నుంచి నిత్యం ట్రాక్టర్లపై వివిధ గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా పశ్చిమగోదావరి జిల్లా నుంచి భారీ స్థాయిలో ఇసుక కోసం ట్రాక్టర్లు ర్యాంపు వద్దకు చేరుకున్నాయి. ఈ ర్యాంపు నుంచి కేవలం ఈ మండలంలోని ఉన్న ట్రాక్టర్లకే లోడు చేస్తామని ఇతర మండ లాలకు చెందిన వారు రావొద్దని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఇసుక ర్యాంపు వద్ద నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే ఇసుక లోడు ట్రాక్టర్‌ను ఆపి జాతీయ రహదారిపైనే ఇరువర్గాలు ఘర్షణకుదిగాయి. మా ట్రాక్టర్లకు లోడు ఎందుకు వెయ్యరంటూ ఇతర ప్రాంతవాసులు, లోడింగ్ చేసేది లేదంటూ స్థానికులు తారాస్థాయిలో ఘర్షణపడ్డారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీస్థాయిలో నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దారు బీఎం ముక్తేశ్వరరావు, సీఐ శేఖర్‌బాబు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సీఐ ఆందోళనకారులతో మాట్లాడి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లతోపాటు స్థానిక ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించివేయడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం తహశీల్దారు, సీఐలు ర్యాంపు బాటలోకి ఎటువంటి వాహనాలు వెళ్లకుండా దారిమూయించివేశారు.

స్థానికులకు మాత్రమే ఇసుక లోడింగ్

- తహశీల్దారు ముక్తేశ్వరరావు

ప్రభుత్వ నిబంధనల మేరకు నదీపరివాహక ప్రాంత గ్రామాల వారు మాత్రమే ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ఇసుకను తరలించుకోవాలి. గోపాలపురం ర్యాంపునకు సమీప గ్రామాలైన ముమ్మిడివరప్పాడు, ఈతకోట, పొడగట్లపల్లి, కేతరాజుపల్లి, వెదిరేశ్వరం, దేవరపల్లి గ్రామాల వారు ఇక్కడి నుంచి గృహావసరాలకు ఇసుకను తరలించుకోవాలన్నారు. ప్రస్తుతం వివాదం తలెత్తిన నేపథ్యంలో ఇసుక ర్యాంపును తాత్కాలికంగా మూసివేస్తున్నామన్నారు.


గోపాలపురం జాతీయ రహదారిపై వాగ్వివాదానికి దిగిన వాహనదారులు

పగలంతా డంపింగ్.. రాత్రంతా లిఫ్టింగ్


ఈతకోట గంటిరోడ్డులో చెక్కలు కట్టిన టాక్టర్‌కు లోడు

గృహఅవసరాలకు, పేదప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానానికి కొందరు మాఫియా సభ్యులు తూట్లుపొడుస్తున్నారు. ఇసుక ర్యాంపు నుంచి ఉచితంగా ట్రాక్టర్లతో గృహ వినియోగదారులు ఇసుకను తరలించుకునేందుకు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ కొందరికి కాసులు పండిస్తోంది. వైసీపీ పాలనలో ఇసుక ధరలు ఆకాశాన్నంటడంతో గృహ వినియోగదారులు నిర్మాణరంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ఇలాంటి ఇబ్బందులు సామాన్యులు ఎదుర్కొనకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టి సక్రమంగా నిర్వహించాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ విధానానికి తూట్లు పొడుస్తూ రావులపాలెం మండలం గోపాలపురం ఇసుక ర్యాంపు నుంచి కొందరు మాఫియా సభ్యులు పగలంతా ట్రాక్టర్లతో పలు ఖాళీ ప్రదేశాలలో దిగుమతిచేసి ఇసుకను నిల్వ చేస్తూ రాత్రి సమయాలలో ఎక్స్‌కవేటర్లతో లారీలలో ఎగుమతులు చేసి అధిక ధరలకు అమ్మి సొమ్ములు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఐదు యూనిట్ల లారీ ఇసుక అమలాపురం పరిసర ప్రాంతాలకు వెళ్లాలంటే వినియోగదారుల అవసరాన్ని బట్టి కిరాయితో కలిపి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారు. ట్రక్కుకు అదనంగా చెక్కలు కట్టిన నాలుగుచక్రాల ట్రాక్టర్‌కు లోడువేసి రూ.8వేల నుంచి రూ.10వేలవరకు విక్రయిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నా రు. అక్రమ ఇసుక వ్యాపారంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపట్ల విమర్శలకు తావిస్తోంది.

అప్పుల బాధ తాళలేక హోటల్ యజమాని ఆత్మహత్య


మృతి చెందిన సురేష్‌బాబు

ఎటపాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి బిర్యానీ హోటల్ యజమాని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన శనివారం అల్లూరిజిల్లా ఎటపాక మండలం పురు షోత్తపట్నంలోని సెయింట్‌ఆన్స్ ప్రైవేట్ పాఠశాల వెనుక(ముత్యాలమ్మతల్లి ఆలయం) సమీపంవద్ద జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన నూతనపాటి సురేష్‌బాబు (36) కొంతకాలం సారపాక ఐటీసీ (బీపీఎల్)లో పనిచేశాడు. ఈక్రమంలో గత ఐదునెలల క్రితం భద్రాచలం బస్టాండ్ ఎదురుగా బిర్యానీ హోటల్‌ను ప్రారంభించాడు. బిర్యానీ హోటల్ వ్యాపారం ఆశించినస్థాయిలో నడవకపోవడంతో రూ.7లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీంతో మనస్థాపం చెంది, శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి, ఆ రాత్రే పురుగుల మందు తాగాడు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.


అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

భక్తజన గిరీశుడు!

- భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి
- వరుసగా ఐదురోజులపాటు కార్తీక పర్వదినాలు
- శనివారం రూ.60లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి భక్తులతో పోటెత్తుతుంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తున్నారు. మంగళవారం వరకు వరుస పర్వదినాలు ఉండడంతో భక్తులు గణనీయంగా పెరుగుతారని భావించి దానికనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం ఒక్కరోజు 5524 వ్రతాలు జరుగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.60లక్షల ఆదాయం లభించింది. సత్రంగదులు లభ్యం కాకపోవడంతో డార్మెటరీలు, విష్ణుసదన్ హాల్స్‌లో ఉచిత వసతి కల్పించారు. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రద్దీకి అనుగుణంగా సూచనలిస్తుండడంతో భక్తులకు త్వరితగతిన దర్శనభాగ్యం కలుగుతుంది.

మూలనిధికి రూ.2లక్షల విరాళం

సత్యదేవుడి ఆలయ మూలనిధికి హైదరాబాద్‌కు చెందిన ఏ రాజశేఖరరెడ్డి ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు రూ.2లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు సత్యశ్రీనివాస్ స్వామివారి ప్రత్యేకదర్శనం ప్రసాదాలు అందించారు.

భక్తులకు రవాణా సౌకర్యం


భక్తుల కోసం ఏర్పాటుచేసిన టాటా మ్యాజిక్ వాహనాలు

కార్తీకమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి రైలు, రోడ్డు, ఇతర మార్గాల్లో వచ్చేవారికి దేవస్థానం కల్పిస్తున్న రవాణా సౌకర్యం భక్తులను సంతృప్తి పరుస్తోంది. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కొండపైకి, కొండదిగువకు దేవస్థానం తరుపున ఏడు బస్సులను సాధారణ చార్జీలతో తీసుకెళుతుండగా కొండపై సత్యగిరి నుంచి రత్నగిరికి 10 టాటా మ్యాజిక్‌లు, రెండు ఉచిత బస్సుల ద్వారా చేరవేస్తున్నారు. భక్తులు గణనీయంగా పెరగడంతో కార్తీకం ప్రారంభం నుంచి ఎన్నడూ లేని విధంగా ఎనిమిది రోజుల్లో సుమారు రూ.6లక్షల ఆదాయం లభించినట్లు రవాణా విభాగ అధికారులు తెలిపారు.

నేడు 10 బస్సులలో ఉచిత ప్రయాణం

భక్తుల రద్దీ నేపథ్యంలో ఆదివారం ప్రకాష్, శారదా, తిరుమల విద్యాసంస్థల నుంచి 10 బస్సుల ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. వృద్ధులు, దివ్యాంగులను నేరుగా లిఫ్ట్ వద్దకు తీసుకెళ్లేందుకు టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించనున్నట్లు ఈవో తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.25 లక్షలు విరాళం


విరాళం అందజేస్తున్న దాత గల్లా గుండయ్య దంపతులు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన గల్లా రోశమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గల్లా గుండయ్య దంపతులు ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం, స్వామివారి ప్రసా దం అందజేశారు. దీనిపై వచ్చేవడ్డీతో ప్రతీఏటా కార్తీకపౌర్ణమి పర్వదినాన అన్నదానం జరిపించాలని దాత కోరారు.

తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- వీసీ ఆచార్య శ్రీనివాసరావు
- 'నన్నయ'లో జాతీయ శతాధిక కవి సమ్మేళనం



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు సాహిత్య రచనలను ప్రపంచ భాషల్లో అనువాదం చేయడంద్వారా తెలుగు సాహిత్య ఔన్నత్యం విశ్వవ్యాప్తం అవుతుందని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం గోదావరి కవనోత్సవం-141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విశ్వజనీన ఆలోచనలతో సమాజ హితం కోసం కవులు రచనలు సాగించాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగపడే రచనలను ఇతర భాషల్లోకి అనువాదం చేసి తెలుగువారి గొప్పతనాన్ని చాటాలన్నారు. శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో సాహిత్య సదస్సులు నిర్వహించామన్నారు. ప్రతినెలా కవి సమ్మేళనం నిర్వహిస్తూ ప్రస్తుతం 141వ సదస్సును నన్నయ వర్సిటీలో జరిపామన్నారు. త్వరలో మలేషియాలో అంతర్జాతీయ తెలుగు సాహిత్య సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. సదస్సు కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ యువతలో తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు తెలిపి అభినందించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ రచనలను, కవితలను వినిపించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, సభ్యులు టి.పార్థసారధి, అద్దంకి రాజా, పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

ముగిసిన జిమ్నాస్టిక్స్ పోటీలు

కాకినాడఅర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న అంతర్‌జిల్లాల ఏఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్స్ పోటీలు శనివారంతో ముగిశాయి. వందలాది మంది క్రీడాకారులు హాజరవ్వగా అండర్14, 17,19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించినట్టు పాఠశాలల క్రీడాసమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి తెలిపారు. విజేతలకు పతకాలను ముఖ్యఅతిథులు అందించారన్నారు. వివిధ విభాగాల్లో విజేతలైనవారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు విఠల్, పరిశీలకుడు పూర్ణచంద్రరావు, పీఈటీసంఘ జిల్లా కార్యదర్శి సునీల్, జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్, సంయుక్త కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.


జిమ్నాస్టిక్ట్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపికైన విజేతలు

పోటీల్లో పాల్గొనడమే ఒక విజయం: డీఈవో


క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడమే ఒక విజయమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. పోటీల్లో మంచి ప్రతిభ చూపించి గెలుపొందడం ద్వారా సాధించిన సర్టిఫికెట్లు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించేందుకు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రెండురోజులపాటు జరిగే 68వ అండర్-17 బాలుర అంతర్‌జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈవో వాసుదేవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అర్బన్ డీఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి జట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పరిశీలకుడు తంబి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి స్వామి, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- తొలిరోజున లీగ్ దశలో 12 పోటీలు...

తొలిరోజున పలు జట్ల మధ్య లీగ్ దశలో పోటీలు జరిగాయి. మొత్తం 12 మ్యాచ్‌లు నిర్వహించారు. మరో మూడు మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా సమయం లేకపోవడంతో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి వీటిని నిర్వహించనున్నారు. అనంతరం నాకౌట్ పోటీలు ప్రారంభమవుతాయి. లీగ్, నాకౌట్ దశల్లో గెలుపొందిన జట్లు క్వార్టర్స్, సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో పోటీ పడతారని జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్ తెలిపారు.

తూర్పులక్ష్మీపురంలో విషాదఛాయలు

- మృతదేహాలు లభ్యం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ


మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికి అందివచ్చిన వ్యక్తులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదం ఏర్పడింది. పెద్దదిక్కుగా ఉన్న తండ్రీకొడుకులు మృతి చెందడంతో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం, జయబాబు, చింతా శ్రీనివాస్, అల్లుడు చిన గొంతియ్య ఇంటి నిర్మాణం కోసం అడ్డతీగల మండలం బొంగరాలపాడు వెళ్లిన విషయం తెలిసిందే. వారు నలుగురు ప్రమాదశాత్తు వాగులో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో ఉన్నారు. తూర్పులక్ష్మీపురంలో బాధిత కుటుంబాలను శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. సీఎం సహాయనిధి నుంచి మృతులు ఒక్కొక్కరికీ రూ.5లక్షలు చొప్పున ప్రభుత్వం తరుపున ఎక్స్‌గ్రేషియా ఎమ్మెల్యే సత్యప్రభ ప్రకటించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి మృతుల కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం తరుపున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అండగా ఉంటామన్నారు. ఏలేరులో ఇసుక తవ్వకాలు చేపడుతున్నవారికి ప్రమాదకరమైన ప్రదేశాలు ఉంటే అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

మరో రెండు మృతదేహాలు లభ్యం

గల్లంతైన నలుగురిలో శుక్రవారం వీరమళ్ల జయబాబు, చిన గొంతియ్య మృతదేహాలు వెలికి తీశారు. మిగిలిన వీరమళ్ల భూషణం, చింతా శ్రీనివాస్ మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. అంత్యక్రియలు చేపట్టేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నవోదయ ప్రవేశానికి గడువు పెంపు

పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయ 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి మరోసారి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 19వరకూ పెంచినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2.11.24 నుంచి 21.11.24 తేదీల్లో దరఖాస్తుల్లో తప్పులను సవరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1,01,116 విరాళం


దాతను సత్కరిస్తున్న ఈవో

అయినవిల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళం అందించారు. వీరికి ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతను అభినందించిన శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

12న విశ్వేశ్వరస్వామి కల్యాణం

కొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిలో వేంచేసి ఉన్న శ్రీఅన్నపూర్ణాసమేత విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణం ఈనెల 12 నుంచి 17 తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు రామకృష్ణ తెలిపారు. ఆరురోజులపాటు జరిగే స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్‌పై పోరాటం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

కాకినాడ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్‌పై దశల వారీ పోరాటం చేపట్టనున్నామని, దీనిని సముద్ర తీర ప్రాంత మత్స్యకారులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో సీపీఐ జిల్లా సమితి సమావేశం తోకల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడకు 30 కిలోమీటర్ల దూరంలో సముద్ర గర్భం నుంచి ఈ ఏడాది జనవరి 7 నుంచి చమురు నిక్షేపాల వెలికితీత ప్రారంభమైందన్నారు. దీని విలువ కొన్ని లక్షల కోట్ల రూపాయలకు మించి ఉంటుందన్నారు. ఆంధ్ర తీరంలో ఉన్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చబోతున్నాయన్నారు. అటువంటి నిక్షేపాలను కేంద్రం రాష్ట్ర వాటా ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. దీనిపై సీపీఐ దశలవారీ పోరాటం నిర్వహిస్తుందన్నారు. స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరులను ఉపయోగించుకునే హక్కు ఆ ప్రాంతానికి ఉంటుందని, ఆ రాష్ట్రానికి 50 శాతం వాటా కేటాయించాలన్నారు. 12వ ఆర్థిక సంఘం కూడా ఇదే చెప్పిందని, దీనిని కేంద్రం అమలు చేయాలని లేకుంటే కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అని, డిసెంబర్ 26న శత వసంతాల వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కే.బొడకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, టి.అన్నవరం, బొబ్బిలి శ్రీను, చింతపల్లి సుబ్బారావు, కేశవరపు అప్పలరాజు, ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలో వేచి ఉన్న భక్తులు

పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని శనివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచేస్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,41,360, అన్నదాన విరాళాలు రూ.1,19,324 ఆదాయం, కేశ ఖండన ద్వారా రూ.6,040, తులాభారం, కానుకల ద్వారా రూ.550, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.39,735 వెరసి రూ. 5,07,009 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులు రక్తహీనతపై అవగాహన పెంచుకోవాలి'

కరప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు రక్తహీనతపై అవగాహన పెంపొందించుకుని దాని నివారణకు బలవర్ధకమైన సమతుల ఆహారాన్ని తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆరోగ్య కార్యనిర్వాహక కార్యదర్శి, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. కరప, గొల్లపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో శనివారం పలువురు గర్భిణులకు ఆయన పండ్లు, బిస్కెట్లు అందజేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. మండల వైద్యాధికారి శ్రీనివాసనాయక్, పెంకే శివకుమార్, వనుం శ్రీనివాసరావుఉ, డాక్టర్ పెద్దిరెడ్డి శ్రావ్య, రత్నకుమారి తదితరులున్నారు.

పాదగయలో కోటి సోమవారం పూజలు


పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు

పిఠాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కోటి సోమవారం పూజలు శనివారం జరిగాయి. కార్తీకమాసంలో శ్రవణనక్షత్రం ఉన్న రోజును కోటి సోమవారంగా వ్యవహరిస్తారు. అది శనివారం రావడంతో శివకేశవులకు ప్రీతికరమైన రోజు కావడంతో దీనికి ప్రత్యేక విశిష్టత ఏర్పడింది. కోటి సోమవారం సందర్భంగా భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరిణి వద్ద, ఆలయంలోనూ దీపాలు వెలిగించారు. ఏర్పాట్లును ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పర్యవేక్షించారు.

దుర్గాడలో...

గొల్లప్రోలు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రవణ నక్షత్రం కూడిన శనివారం కార్తీకమాసంలో రావడంతో పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామికి కోటి సోమవారం పూజలు నిర్వహించారు. స్వామికి 27 ద్రవ్యాలతో నమకం, చమకం, రుద్రపారాయణ, దశ శాంతులు, సామ్రాజ్య పట్టాభిషేకం జరిగాయి. స్వామిని గోవిందనామాలు, తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివం అభినందనీయులని, నాయీ బ్రాహ్మణులపై కూటమి ప్రభుత్వం చూపుతున్న ఆదరాభిమానాలకు రుణ పడి ఉంటామని కాకినాడ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దేవాలయాల పాలక మండలిల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించడం ఆనందకరమన్నారు. అలాగే మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సెలూన్‌కు 200 యూనిట్లు ఉచిత కరెంటు అమలు పరచాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్‌శాఖలలో నాయీ బ్రాహ్మణ కోటాను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, నాయకులు స్వయంవరపు భద్రరావు, చిట్టాబత్తుల నాగబాబు, స్వయంవ రపు శ్రీనివాసరావు, తగరంపూడి వాసురావు పాల్గొన్నారు.

కష్టపడేవారికి గుర్తింపు

కష్టపడి పని చేసే కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు ఉంటుందని, ఇందుకు సీఎం చంద్రబాబు రాష్ట్ర మైనార్టీస్ సలహాదారుడుగా కేబినెట్ హోదాతో ఎంఏ షరీఫ్‌కు పదవి ఇవ్వడమే తార్కాణమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ జహరుద్దీన్ జిలాని పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో షరీఫ్ ఎన్నో పదవులు నిర్వహిచారని, నీతి నిజాయితీలకు ఆయన మారు పేరని అన్నారు. సీఎం చంద్రబాబు అడుగుజాడలలో నడవడం ఆయనకే సాధ్యమని కొనియాడారు. మైనారిటీలకు సంక్షేమ పథకాలను అందించి, వారిని అభివృద్ధి పథంలో తీసుకువచ్చి కూటమి ప్రభుత్వం మన్ననలు పొందాలని జిలాని ఆకాంక్షించారు. ఆయన వెంట కరీముల్లా, కసమూర్, మౌలానా తదితరులున్నారు.

వెంకటరమణ చౌదరి నియామకంపై హర్షం

సామర్లకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బొడ్డు వెంకరమణ చౌదరిని రాజమండ్రి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరామారావు అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధిష్టానం చౌదరి సేవలను గుర్తించి రుడా చైర్మన్‌గా ఎంపికచేయడంతో పార్టీ శ్రేణులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ పటిష్టతకు కార్యాచరణ సిద్ధం చేయాలి

పిఠాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టతకు కార్యాచరణ సిద్ధం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్టీ జిల్లా ఎన్నికల సహ రిటర్నింగ్ అధికారి పెద్దిరెడ్డి రవికిరణ్ సూచించారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో శనివారం జరిగిన బీజేపీ సంఘటన పర్వ్-2024 కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 43 పోలింగ్ బూత్‌ల్లో కమిటీలు వేయాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ పట్టణ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవణం సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకటసూర్యనారాయణరాజు, గండి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు, అడబాల వీరమోహనరావు, ఓలేటి వెంకటేశ్వరరావు, గరగ వీరబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ


ఆరో నిందితుడిని అరెస్ట్ చేయాలంటూ మంత్రికి విన్నవించుకుంటున్న బాధితులు

కరప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం శలపాకలో శనివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటించి ఇటీవల హత్యకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. దారుణహత్యకు గురైన బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌ల భార్య, పిల్లలను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ హత్యలకు సంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చనిపోయిన బత్తుల చిన్నయ్య, బత్తుల రాజుల భార్యలకు జీవనోపాధికి అవసరమైన ఉపాధి కల్పిస్తామని, చనిపోయిన బత్తుల రమేష్‌కు 9 నెలల బాబు ఉండగా, అతడి పేరుమీద రూ.50వేలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ హత్యలకు పాల్పడినవారిలో ఐదుగురిని మాత్రమే పోలీసులు అరెస్ట్ చేశారని, ఆరో నిందితుడు పొట్లకాయల సాయికిరణ్ బయట తిరుగుతున్నాడని బాధితులు మంత్రికి వివరించారు. అతని వల్ల తమకు, తమకు మద్దతుగా నిలిచిన పలువురు స్థానికులకు ప్రాణహాని ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బాధితులు మంత్రిని చుట్టుముట్టి తమకు న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి సుభాష్ స్థానిక ఎస్ఐ మోహన్‌కుమార్‌ని పిలిచి విషయం ఆరాదీశారు. ఆరో నిందితుడిని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు.

ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పిఠాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు సూచించారు. పిఠాపురం మండలం కుమారపురం ఎస్సీ కాలనీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని తెలిపారు. ఇందులో పరిష్కారమైన కేసులను ఏ కోర్టులోనూ సవాల్ చేసే అవకాశం ఉండదని చెప్పారు. చట్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నల్లా రాజబాబు, ఉపసర్పంచ్ బి.వీర్రాజు, మాజీ సర్పంచ్ ఎం.జగ్గారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, న్యా యవాదులు బీఏకే బాబు, ఏసురత్నం, వై.శ్రీనివాస్, కె.నూకరాజు, గంగాభవానీ, భార్గవి, రూ రల్ ఎస్ఐ గుణశేఖర్ తదితరులున్నారు.

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే రాజప్ప అభినందన


చంద్రబాబుకు నమస్కరిస్తున్న చినరాజప్ప

సామర్లకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీప్లేన్‌లో విజయవాడ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శనివారం జలాలపై జాలీగా పర్యటన ప్రారంభించి అదే సీప్లేన్‌లో శ్రీశైలం చేరుకున్న సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అభినందించారు. ఈ మేరకు శ్రీశైలం పాతాళగంగ ప్రాజెక్ట్ వద్దకు ముందే చేరుకున్న చినరాజప్ప సీప్లేన్‌లో చేరుకున్న చంద్రబాబుకు సాదరంగా స్వాగతం పలికి అభినందించారు. పర్యాటకరంగం మరింత అభివృద్ధి చెందేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన విధానాలు అమలుచేస్తూ ముందుకు దూసుకుపోవడం అభినందనీయమని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. అనంతరం చంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యే చినరాజప్ప శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జ్యోతుల నెహ్రూకు సత్కారం

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యు లుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వయంగా తిరుమల చేరుకుని శనివారం అభినందించారు. నెహ్రూను చినరాజప్ప పూలమాలతో సత్కరిం చారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, డబుల్ సెవన్ రాజు తదితరులున్నారు.

చేనేత కార్మికుల స్థితిగతులపై సర్వే

గొల్లప్రోలు రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు అవసరమైన పరికరాలు సమకూర్చేందుకు గానూ చేనేత జౌళిశాఖల అధికారులు సర్వే చేపట్టారు. చేనేత కార్మికుల సంక్షేమానికి గానూ పిఠాపురం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టదలచిన కార్యక్రమానికి గానూ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డీవో రవి, ఏడీవో గణేష్ ఆధ్వర్యంలో శనివారం కార్మికుల వద్దకు వెళ్లి వారి అవసరాలు తెలుసుకున్నారు. మగ్గాలకు కావాల్సిన జాగర్డ్ మిషన్లు, లిఫ్టింగ్‌మిషన్లు, అచ్చులు, ఇతర పరికరాలను ఈ పైలట్ ప్రాజెక్టులో సబ్సిడీపై అందజేయనున్నట్లు ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ తెలిపారు.

మోకాళ్ల మార్పిడి విధానంపై అవగాహన

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సా విధానంపై కాకినాడ జీజీహెచ్‌లో శనివారం ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ డా.ఎస్ లావణ్యకుమారి సూచనలతో ఎముకల (ఆర్థోపెడిక్) విభాగాధిపతి డా.ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో గుంటూరుకు చెందిన ఆర్థో వైద్య నిపుణుడు డా.బుసిరెడ్డి నరేంద్రరెడ్డి మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సను ప్రత్యక్ష ప్రసారం ద్వారా విజయవంతంగా నిర్వహించారు. అనంతరం మోకాలిలో వయస్సు రీత్యా వచ్చే అరుగుదలలు, ఆస్టియో ఆర్థరైటీస్‌కు సంబంధించిన కారణాలు, నివారణా మార్గాలు, చికిత్సా విధానంలో వచ్చిన నూతన ఒరవడులు తదితర అంశాలపై ఆర్థోపెడిక్ విభాగం నందు ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆర్థో వైద్యనిపుణులు ప్రొఫెసర్ డా.బి పార్ధసారధి, ప్రొఫెసర్ డా.ముఖర్జీ, జీజీహెచ్ విశ్రాంత సూపరిండెంట్ డా.వై.నాగేశ్వరరావు, డా.బిఎస్ఎస్ వెంకటేశ్వర్లు, డా.అనిల్‌బాబు, ప్రముఖ మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సా నిపుణులు డా.ముత్తా ఆదిత్యకృష్ణ, డా.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఉచిత లీగల్ సర్వీసులపై అవగాహన

సర్పవరం జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో శనివారం రాజీవ్‌గాంధీ లా కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత లీగల్ సర్వీసులపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరశెట్టి రవికిషోర్ విచ్చేసి మత్స్యకారులకు అవగాహన కల్పించారు. నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలందించేందుకు సిద్ధంగా ఉచిత న్యాయసేవాధికార సంస్థ ఉందన్నారు. ప్రాథమిక చట్టాలపై సరైన అవగాహన లేక గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంవీఏ, పోక్సో చట్టం, ఉమెన్ ప్రొటెక్షన్ యాక్ట్, సైబర్ క్రైం, ప్రాథమిక చట్టం, ఎంఐఆర్, నెగోసిబుల్ ఇన్‌స్ట్రుమెంట్, ల్యాండ్ డిస్ప్యూట్ చట్టాలపై పలువురు రీసోర్సు పర్సన్లు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, సత్యశ్రీ, సుగుణ గంగ, భార్గవి, సుకన్య విజయ్‌కుమార్, లిఖిత, అనుష్క పాల్గొన్నారు.

రామస్వామి శతజయంతి మహోత్సవాలు ప్రారంభం

పిఠాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం పీఠాధిపతి, సద్గురు సజ్జనగడ రామస్వామి శత జయంతి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. 3రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శనివారం విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, శ్రీపాదశ్రీవల్లభస్వామికి శత రుద్రీయ అభిషేకం, సద్గురు రామస్వామి వారి పాదుకలకు అభిషేకం, పూజ నిర్వహించారు. సాయంత్రం సద్గురు రామస్వామి చిత్రపటాలు, శ్రీపాదశ్రీవల్లభుల ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం జరిగింది. మహారాష్ట్ర, తెలంగాణా, కర్నాటకలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో ఆర్.సౌజన్య పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలను పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ వేదమంత్రోచ్ఛారణల మధ్య అభి షేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మ వారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. లక్షపత్రి పూజలలో అమలాపురానికి చెందిన లింగం పండు దంపతులు ఆశీనులయ్యారు. సాయం త్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆకాశదీప పూజలలోనూ, జ్యోతిర్లింగార్చన పూజల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియాపై ఫిర్యాదు

కాకినాడ క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వైసీపీ నాయకులపై టీడీపీ వర్గాలు అసభ్యకర పదజాలంలో పోస్టింగ్‌లు పెడుతున్నారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కరరావుకు శనివారం ఫిర్యాదు చేశారు.

బుద్ధ భగవాన్ విగ్రహంపై కూర్చుని ఆకతాయిల వికృత చేష్టలు



కాకినాడ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం ఘాటీ సెంటర్ అన్నమ్మ చెరువు మధ్యనున్న బుద్ధ భగవాన్ విగ్రహంపై కూర్చున్న ఆకతాయిల వికృత చేష్టల దృశ్యం శనివారం కనిపించింది. ఆ ప్రాంత ఆలోచనపరుల విజ్ఞాపన మేరకు గత ప్రభుత్వ హయంలో చెరువు మధ్యన 21 అడుగుల ఎత్తున బుద్ధ భగవాన్ విగ్రహం ప్రతిష్ఠించారు. ఈ చెరువు ఆధునీకరణ పనులలో భాగంగా విగ్రహం ఏర్పాటుతో పాటు మూడు వైపులా గట్టును వాకింగ్ ట్రాక్‌గా ఆధునీకరించారు. అయితే ఈ సుందరీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో సాయంత్రం సమయంలో ఆకతాయిలు బుద్ధ భగవాన్ విగ్రహం ఎక్కి తలో భాగంలో కూర్చుని రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ఈ ప్రాంగణంలో ఏ పర్యవేక్షణ లేకపోవడంతో తాగుబోతులకు, గంజాయి తాగేవాళ్లకు, పేకాట గాళ్లకు నిలయంగా మారిందని ఉమ్మడి జిల్లా దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలు కొనసాగకుండా సిటీ ఎమ్మెల్యే, నగరపాలక స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఎస్పీ, ఒన్‌టవున్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

మెడికవర్‌లో వృద్ధుడికి శస్త్ర చికిత్స

సామర్లకోట, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): వాస్క్యులర్ శస్త్రచికిత్సలో సామర్లకోట పనసపాడు మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందం విజయవంతం చేసి 65ఏళ్ల వ్యక్తికి నూతన జీవితాన్ని అందించారు. మెడికవర్ హాస్పిటల్ ఆవరణలో శనివారం విలేకర్ల సమావేశంలో శ్యామ్‌కుమార్ అనే బాధితుడికి అందించిన వైద్యంపై వైద్యనిపుణులు వివరించారు. శ్యామ్‌కుమార్ కొద్దికాలం క్రితం జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయాలపై చికిత్స పొందిన ప్పటికీ తగ్గకపోగా గాయాలు చుట్టూ నల్లని మచ్చలు, నల్లగా గాన్ గ్రీన్ వలే మారిపోయి విపరీతమైన నొప్పి రావడంతో మెడికవర్ హాస్పిటల్‌కు చేరినట్లు మెడికవర్ వాస్క్యులర్, ఎండో వాస్క్యులర్ సర్జరీ నిపుణులు డాక్టర్ ఎస్.శ్రీరామ్ అమరేంద్రబాబు వెల్లడించారు. దీంతో వైద్యపరీక్షలు నిర్వహించగా అతడి కాళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరగడం లేదని గుర్తించామన్నారు. కాళ్లకు తిరిగి రక్త ప్రసరణ పునరుద్ధరించేందుకు శస్త్రచికిత్సను బృహద్దమని (అయోటా) నుంచి కృత్రిమ గ్రాఫ్టులను వినియోగించి బైపాస్ సర్జరీ నిర్వహించామన్నారు. క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ జగదీశ్వరరావు మాట్లా డుతూ కేవలం 2రోజుల్లోనే శ్యామ్‌కుమార్‌ను డిశ్చార్జి చేయడం జరిగిందన్నారు. ఇటువంటి క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు నిర్వహించడంలోనూ శ్రమిస్తూనే ఉంటామని సెంటర్ హెడ్‌ప్రభాకరరావు డాక్టర్లను అభినందించారు.

ఘనచరితల రెడ్లు పుస్తకావిష్కరణ

కాకినాడ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ,విద్యా,వ్యాపార రంగాల్లో స్ఫూర్తిదాయకంగా నిలిచిన రెడ్ల చరిత్రను అందరూ చదువుకునేందుకు వీలైన భాషలో రూపొందించారని ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అన్నారు. రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన ఘనచరితల రెడ్లు సుగుణశీలురు భూమంచి రెడ్లు అనే పుస్తకాన్ని శేషారెడ్డి శనివారం కాకినాడ శ్రీనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ శతాబ్దాల నుంచి తెలుగుజాతికి రెడ్లు అనేక రంగాలలో ఎనలేని సేవలందించారని వారి కృషిని రేపటి తరాలకు అందివ్వాలనే ఈ పుస్తకం రచించానన్నారు. రెడ్డి సంక్షేమసంఘం అధ్యక్షుడు ఎన్.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఘన చరిత్రను రచయిత ర్యాలి ప్రసాద్ సవివరంగా అందించాలని తెలిపారు. సంస్థ కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధారాలతో కూడిన చరిత్ర అందరూ చదవాల్సిన పుస్తకమని తెలిపారు. కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శేషారెడ్డి

వైద్యరంగంలో ప్రావీణ్యం సాధించాలి : వీసీ


సదస్సులో వివరిస్తున్న వీసీ మురళీకృష్ణ

తాళ్లరేవు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులంతా వైద్యరంగంలో ప్రావీణ్యం సాధించే దిశగా ముందుకుసాగాలని జేఎన్టీయూకే వీసీ కేవీఎస్‌జీ.మురళీకృష్ణ అన్నారు. శనివారం కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు వైద్యసేవలు, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా వైద్యరంగంలో ఉన్నత స్థానాలు సాధించి సమాజాభివృద్ధికి సేవలందివ్వాలన్నారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, సెక్రటరీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'మాలలంతా సంఘటితం కావాలి'

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలలంతా సంఘటితం కావాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కాకినాడలో జరిగిన పీవీ రావు మాలమహానాడు కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, దీని వల్ల భవిష్యత్‌లో మాలలకే కాకుండా ఇతర ఉపకులాల వారందరికీ తీవ్ర నష్టం కలుగుతుందని అందుకే మాలలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. మంద కృష్ణ మాదిగ రాజకీయ పార్టీలకు తొత్తుగా మారి మాలలను విమర్శిస్తున్నారని ప్రతీ ఒక్కరూ దీన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కాకినాడ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

మూలపేటలో ఎస్ఐ విచారణ

కొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూలపేటలో వృద్ధ దంపతులపై వారి సామాజిక వర్గం చూపుతున్న వివక్షతపై కొత్తపల్లి ఎస్ఐ పి.వెంకటేష్ శనివారం విచారణ నిర్వహించారు. గౌరీదేవి సంబరాలకు చందా ఇవ్వలేదని రాజాపంతుల బాబూరావు, భార్య సీతారత్నంపై అదేసామాజిక వర్గానికి చెందిన కుల పెద్దలు వివక్షత చూపుతున్నారే విషయంపై ఎస్ఐ విచారణ చేపట్టారు. చందా ఇవ్వమని ఇవ్వలేమని చెప్పడంతో కేవలం గౌరీదేవి సంబరాలకు మాత్రమే ఆహ్వానం ఇవ్వలేదని, మిగిలిన కార్యక్రమాలన్నీ యథావిధిగా సాగుతున్నాయని పెద్దలు ఎస్ఐకు వివరించారు. వివరించారు. ఎప్పటిలాగే చందా ఇవ్వండని నాగేశ్వరరావుకు కులపెద్దలు విజ్ఞప్తి చేశారు.

దోమల మందు స్ప్రే

కొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగులాపల్లి పల్లపు వీధిలో పీహెచ్‌సీ సిబ్బంది దోమల నివారణకు మందు స్ప్రే చేయించారు. వీధిలో మురుగుకాలువల్లో నీరు నిల్వ, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై పంచాయతీ సిబ్బంది స్పందించకపోయినా పీహెచ్‌సీ సిబ్బంది చర్యలు చేపట్టారు. పీహెచ్‌సీ డాక్టర్ రిచిశర్మ, ఆరోగ్యసిబ్బంది హెచ్‌వీ రత్నకుమారి, కాకరపల్లి గంగాధర శ్రీనివాసరావు, పిజాన్, మరియ్యమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్ పైకి ఎక్కిన కారు

పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గాసెంటర్ వద్ద ఓ కారు అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. కాకినాడ నుంచి నుంచి వస్తున్న ఓకారు దర్గాసెంటర్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఆసమయంలో కారు నెమ్మదిగా వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి ఎస్ఐ మౌనిక చేరుకుని కారును అక్కడ నుంచి క్రేన్ సాయంతో తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శంఖవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు అన్నారు. శనివారం కత్తిపూడిలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు మేలు చేయడమే మండల న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని చెప్పారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అనంతబాబు శవ రాజకీయాలు మానుకో

● ఎమ్మెల్యే శిరీషదేవి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతబాబూ శవరాజకీయాలు మానుకో..లేకుంటే నీమీద ప్రజలు తిరుగుబాటు చేస్తారు. వాస్తవాలు వక్రీకరించకు.. నువ్వు నీ చెంచాగాళ్లు ఇసుక అక్రమ రవాణా చేసేవారు.. కోట్లు దోచుకున్నారు. నీ ఐదు వ్వి తరలించడంవల్ల బొంగరాలపాడులో గోతులుపడ్డాయి. మా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక ఫ్రీ చేశారు. నీవు దోచుకోవడానికి వీలులేకుండాపోయింది. మైనింగ్, ఇసుక మాఫియా అయిన అనంతబాబు, ధనలక్ష్మి మమ్మల్ని విమర్శించే హక్కులేదు. ప్రమాదకర సంఘటనను కూడా రాజకీయం చేయడం విడ్డూరంగా ఉంది. ఇసుక తవ్వి తీసుకెళ్లే వాళ్ల దగ్గర నుంచి నేను ఒక్క పైసా కూడా తీసుకోలేదు. అలాంటి వసూళ్లు నీకుమల్లే మాకు అలవాటు లేదు. ఆధారాలు లేని ఆరోపణలు మానుకో.. మైనింగ్ పాడుకుని జగన్ టాక్స్‌వసూలు చేసుకునే వారిని కూడా నువ్వు నీ అనుచరులు తిమ్మాపురంలో కొట్టి తరిమేసి నువ్వు యథేచ్ఛగా మైనింగ్ దోపిడీకి పాల్పడిన సంగతులు మరచిపోయినా ప్రజలు మరిచపోలేదు.

సీలేరు నుంచి తిరుమలకు పాదయాత్ర


అయ్యప్పస్వాములను కలిసిన వెంకటేశ్వర స్వామి మాలధార భక్తుడు

మోతుగూడెం,నవంబరు9(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరుగ్రామానికి చెందిన కొర్ర గురుమూర్తి అనే యువకుడు వెంకటేశ్వరస్వామి మాలను ధరించి బుధవారం వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమలకు పయనమయ్యాడు. ఈయన 2013, 2019, ఇప్పుడు వెంకటేశ్వరస్వామి దీక్ష తీసుకుని పాదయాత్ర చేస్తున్నారు. ఆయన 10రోజుల కిం దట దీక్ష చేపట్టారు. సీలేరు నుంచి మోతుగూడెం మీదుగా భద్రాచలం విజయవాడ మీదుగా తిరుమలకు కాలినడక పయనమయ్యారు. సీలే రు నుంచి తిరుపతికి 750 కిలోమీటర్లు ఉండగా రోజుకి 20నుంచి 25కిలోమీటర్ల మేర నడుస్తూ 40రోజులు దీక్షను పూర్తిచేసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటానని గురుమూర్తి తెలిపారు. గురుమూర్తి స్వామి శుక్రవారం సాయంత్రం మోతుగూడెం చేరుకుని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో రాత్రిబస చేశారు. అనంతరం ఉదయం తిరుపతికి పాదయాత్రతో బయలుదేరాడు.

'హక్కుల సాధనే లక్ష్యంగా ఏటీఏ పనిచేస్తోంది'


మాట్లాడుతున్న సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్యామల సుబ్బయ్య

చింతూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ హక్కుల సాధనే లక్ష్యంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) పనిచేస్తోందని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్యామల సుబ్బయ్య అన్నారు. శనివారం చింతూరులో ఏటీఏ ఆవిర్భావ దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడారు. ముందుగా ఏటీఏ జెండాను సుబ్బయ్య, గిరిజన సంక్షేమశాఖ పరిధి ఏటీఏ బాధ్యుడు పులి కన్నయ్యలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, బాబూరావు, భద్రయ్య, వెంకన్నబాబు, మధు, రామకృష్ణ, శేఖర్, శ్రీను, కన్నయ్య లక్ష్మి, మీనా, ప్రియాంక, సీత పాల్గొన్నారు.

ఘనంగా ఏటీఏ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎటపాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏటీఏ ఆవిర్భావ దినోత్సవంను శనివారం నల్లకుంట ఏహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఏటీఏ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ తొలుత జెండా ఆవిష్కరించారు. ఏటీఏ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తి చేసుకుందని చెప్పారు ఏటీఏ పోరాట ఫలితంతో . 5వ షెడ్యూల్ ప్రాంతంలోఆదివాసీలకే విద్యా, ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు. ఏజెన్సీలో ప్రకటించే ఉద్యోగాలు ఆదివాసీల అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో నంబరు 3కు ప్రత్యామ్నాయంగా ఏజెన్సీప్రాంత ఉద్యోగ నియామకాలనకు చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయ కులు కాకా శివశంకర్, పండా కిరణ్ కుమార్, తుర్రం రజిని, మానే ప్రవీణ్, గంగా భవానీ, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి'


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

దేవీపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి సంబంధిత శాఖాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. దేవీపట్నం మండల పరిధిలో 14 పంచాయతీలున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టువల్ల సర్వం కోల్పోయిన 42 గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీలు దేవారం, శరభవరం, ఇందుకూరు పంచాయతీల పరిధిలో ఏర్పాటుచేశారు. గతంకంటే ప్రస్తుతం పోలవరం నిర్వాసితుల గ్రామాలు రావడంతో విద్యుత్ రాత్రి సమయంలో సక్రమంగా అందడంలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే దీనిపై అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర ఉన్నారు.

పీఈటీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


పీఈటీ కృష్ణవేణి

ఎటపాక, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎటపాక కేజీబీవీలో పీఈటీగా పని చేస్తున్న కంగాల కృష్ణవేణి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైంది. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ జాబితాలో ఎటపాక నుంచి కేజీబీవీ పీఈటీ కృష్ణవేణి అవార్డుకు ఎంపికవడం జరి గింది. పీఈటీ కృష్ణవేణి 2013 నుంచి 2017 వరకు చింతూరు కేజీబీవీలో పనిచేశారు. 2017 లో అక్కడ నుంచి ఎటపాక కేజీబీవీకు బదిలీ అయ్యారు. కృష్ణవేణి 2023లో నిర్వహించిన మాస్టర్ నేషనల్ చాంపియన్‌షిప్ స్టేట్మెంట్‌లో 800మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించారు. కృష్ణవేణి ఎంపికపట్ల ఎంఈవో రాజులు అభినందిచారు.

డిప్లమో ఇంజనీర్స్ కార్యవర్గం ఎన్నిక

మోతుగూడెం,నవంబరు9(ఆంధ్రజ్యోతి):సీలేరు కాంప్లెక్స్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫీసులో కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమానికి ఈ వెంకటరత్నం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి రావు, అసిస్టెంట్ ఇంజనీర్ శివశంకర్, డొంకరాయి సివిల్ అసిస్టెంట్ ఇంజనీర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగింది. జోనల్ సెక్రెటరీగా బికెఎస్ ప్రసాద్, లోయర్ సీలేరు జోనల్ ప్రెసిడెంట్‌గా ఎస్.పవన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కేటీవీఎస్ శివకుమార్, జాయింట్ సెక్రెటరీ విజయ్, ట్రెజరర్‌గా శ్రీనివాస్, ఆఫీస్ సెక్రటరీగా ఎల్లారీశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. సర్కిల్ సెక్రటరీగా ఎం.సేవ, సెక్రటరీజాన్ విజయకుమార్, సుధాకర్, జి.శ్రీనివాసరావు, ఉదయ్‌కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఈ రాంప్రసాద్, సత్యనారాయణ, లోహిల్, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రమాదకరమైనా.. పట్టించుకోరా?

ఏలేశ్వరంలో ఇళ్లు, దుకాణాల మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు

ఆందోళన చెందుతున్న ప్రజలు


నర్సీపట్నం రోడ్డులో దుకాణాల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్, ఆర్టీసీ కాలనీలో ఇళ్ల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్

ఏలేశ్వరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం నగర పంచాయితీ పరిధిలోని పలు వార్డుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఫ్యూజ్ పెట్టెలు చేతికి అందేలా ప్రమాదకరంగా ఉన్నాయి. నర్సీ పట్నంరోడ్డులో ప్రధాన రహదారి పక్కన, చైతన్య నగర్‌కాలనీ, ఆర్టీసీ కాలనీ, క్వారీపేట, పాత బస్‌స్టాండ్ వద్ద ఇళ్లు, దుకాణాలు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ రక్షణ గోడ లేక చేతికందేలా ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పాత బస్‌స్టాండ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇళ్లు, దుకాణాలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో అక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం ప్రజలను వెంటాడుతోంది. ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కనీసం రక్షణ గోడైనా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతీ నెలా చెట్ల కొమ్మలు నరికివేత పేరుతో పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు కానీ పలు వార్డుల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని, ఇప్పటికన్నా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పలు వార్డుల్లో విద్యుత్ తీగలు దాదాపు ఇళ్లను తాకుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం పడితే ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరా వస్తుందని స్థానికులు ఆవేదన చెంతుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా విద్యుత్ తీగలు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

శబరిమలకు సైకిళ్లపై బయలుదేరిన స్వాములు



తొండంగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెండపూడి గ్రామానికి చెందిన ఎనిమిది మంది అయ్యప్ప భక్తులు శనివారం సైకిళ్లపై శబరిమల యాత్రకు బయలుదేరివెళ్లారు. కోరుకొండ పెదకాపు, బూసాల గణపతి గురుస్వాముల ఆధ్వర్యంలో స్వాములు అయ్యప్ప దర్శనం కోసం సైకిల్ యాత్ర చేపట్టారు. కోరుకొండ పెదకాపు గురుస్వామి ఇప్పటికే 3 సార్లు సైకిల్‌పై శబరిమల వెళ్లి అయ్యప్ప దర్శనం చేసుకోగా ఆయన మార్గదర్శనంలో స్వాములు శబరిమల బయలుదేరారు. సుమారు 18 రోజులు యాత్రచేసి వారు శబరిమల చేరుకోనున్నారు.

పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తిరుపతి నుంచి బయల్దేరి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు పలువురు పీఠాధిపతుల ఆశీస్సులు అందించారు. రేణిగుంట విమానాశ్రయంలో కుర్తాల పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వరనంద భారతిస్వామి జ్యోతుల కుటుంబ సభ్యులను దీవించి ఆశీస్సులు అందించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న ఆయనను శృంగేరి పీఠం తెలుగురాష్ట్రాల ప్రతినిధి బంగారయ్య శర్మ కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు.

గౌరీదేవి ఉత్సవాలు


జాతరలో వేషధారణలు

కిర్లంపూడి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో జగపతినగరంలో గౌరీదేవి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గౌరీశంకరుల ఆలయం వద్ద నుంచి సుమారు వందకు పైగా వేషధారణలతో కళాకారులు జగపతినగరం, కిర్లంపూడి గ్రామాల్లో అలరించారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

లక్ష తులసి పూజ

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తోటవీధిలో సాయినాథ మందిరంలో ఉన్న శ్రీదేవిభూదేవి వేంకటేశ్వర స్వామికి శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. న్యాయవాది అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చుని లక్ష పత్రి పూజను నిర్వహించారు. తహశీల్దార్ ఎం. సూర్యప్రభ, డిప్యూటీ తహశీల్దార్ పుణ్యవతులు, సర్పంచ్ గుడాల విజయలక్ష్మివెంకటరత్నం పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చిలకమర్తి సాయిప్రసాద్, ఉమాదేవి, తేజోమంతుల సుబ్రహ్మణ్యశర్మ, దాడి సూరిబాబు, తూముచినబాబు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన తుమ్మలపల్లి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తుమ్మలపల్లి

జగ్గంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల పాఠశాలను శనివారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు. పాఠశాలలో సమస్యలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్లాస్ రూమ్‌లో విద్యార్థులు నేలపై కూర్చుంటున్నారని 250 బెంచీలు కావాలని, పడుకోవడానికి బెడ్స్ లేక నేలమీద పడుకుంటున్నారని బెడ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలలు ఆయాల కొరత ఉందని వెంటనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు. తుమ్మల మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఆయన వెంట జగ్గంపేట జనసేన మండలాధ్యక్షులు మరిచే రామకృష్ణ, మాదారపు వీరబాబు, ఎంపీటీసీ దొడ్డ శ్రీను, రాజనాల శ్రీను, మొగలి గంగాధర్, సూరపు రెడ్డి నరేష్, గుంటముక్కల చిన్న, గోకాడ రమణ,కోలమూరు బుజ్జి ఉన్నారు.

గడ్డి ట్రాక్టర్‌ను లారీ ఢీకొని నలుగురికి గాయాలు

గండేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గండేపల్లి జాతీయరహదారిపై శనివారం ఉదయం గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం రంగంపేట మండలం రాయవరం గ్రామానికి చెందిన నలుగురు ట్రాక్టర్‌పై గడ్డిలోడు వేసుకుని గండేపల్లి వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తుండగా గండేపల్లి గ్రామశివారున వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో లోడుపై కూర్చుకున్న నలుగురు కిందపడగా గాయాలపాలయ్యారు. వారిని చికిత్సకు రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై గండేపల్లి ఏఎస్ఐ బి.చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.


పక్కకు ఒరిగిపోయిన గడ్డిలోడు ట్రాక్టర్

అలరించిన పడవ కళాలీల కళా ప్రదర్శన


ప్రదర్శన నిర్వహించిన కళాకారులు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవ మహోత్సవంలో స్థానిక కళాకారులు శనివారం ప్రదర్శించిన పడవ కళాలీల ప్రదర్శన అలరించింది. రామాయణంలోని శ్రీరాముడు, గోదావరి నది దాటే ప్రయత్నంలో పడవ కళాసీలు సీతారాములను పడవపై ఎక్కించుకుని గోదావరి దాటిస్తున్న ఘట్టాన్ని ఇతివృత్తంగా పేర్కొన్నారు. రాముడిగా అడబాల రాజబాబు, లక్ష్మణుడిగా ఉర్లంకుల రాజా, సీతగా పెండ్యాల వీరబాబు, బురుడిగా బుద్దాల ముసలి, పడవ కళాసీలగా ఉర్లంకల కాశీ, ఇసరపు శ్రీను తదితరులు నటించారు. రాయి సుబ్బారావు, దాడి శ్రీనివాస్‌లు మేకప్, వస్త్రాలంకరణ చేశారు.

'శ్రీ ప్రకాష్'లో ముగిసిన రిమ్‌జిమ్ వేడుకలు


విద్యార్థులకు బహుమతులు అందజేసిన అతిథులు

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల నందు 5 రోజుల పాటు నిర్వహించిన రిమ్‌జిమ్ వేడుకలు శనివారం ముగిశాయి. తుని, పాయకరావుపేట, అన్నవరం బ్రాంచ్‌ల విద్యార్థులు సుమారు 4500మంది సాహిత్యం, సంగీతం, లలితకళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్ సబ్ జూనియర్ సూపర్ సీనియర్ విభాగాల్లో సుమారు 29 పోటీల్లో సత్తా చాటారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీ రామకృష్ణ, ఆర్.బంగారుబాబు, ఆంధ్ర నేవల్ ఎన్‌సీసీ కమాండ్ ఆఫీసర్, కాకినాడ లెఫ్‌నెంట్ సీడీఆర్ అక్షయ అరుణ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరువయ్యేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్‌విజయ్ ప్రకాష్ అతిథులకు జ్ఞాపికలు బహూకరించారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీ మూర్తి, రిమ్‌జిమ్ కన్వీనర్ ప్రసూనామౌళి, అకడమిక్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు ఇవే

ఎటపాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం, రాయనపేట గోదావరి నదీ పరివాహక ప్రాంతం నుంచి ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గోదావరినదీ నుంచి ఇసుక తరలిస్తున్నట్లు రెవెన్యూ సిబ్బందికి సమాచారం రావడంతో వీఆర్వో వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈక్రమంలో ట్రాక్టర్లల్లో ఇసుక లోడ్ చేసుకుని, రవాణాకు సిద్ధమవుతున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్‌చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. పీవో ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయనచెప్పారు.

విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దేవీపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా మండలంలోని కొత్తవీధి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వలంటీర్ తెల్లం శేఖర్ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, బొరగ నాగరాజు ఉన్నారు.

యనమలతో మాజీ ఎమ్మెల్యే భేటీ


యనమలతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడితో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు సమావేశమయ్యారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో వారు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహాలపై సమాలోచన చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు సుర్ల లోవరాజు, యినిగంటి సత్యనారాయణ, చింగమనీడి అబ్బాయి ఉన్నారు.

చీడికమ్మ జాతరకు ఏర్పాట్లు

కేవో మల్లవరం గ్రామదేవత చీడికమ్మ తల్లి జాతర మహోత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈనెల 12న నిర్వహించే వేడుకకు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని ఆహ్వానించేందుకు ఆలయ కమిటీ సభ్యులు తేటగుంట టీడీపీ కార్యాలయా నికి చేరుకుని ఆహ్వానపత్రిక అందించారు. జాతర పోస్టర్‌ను యనమల, నేతలు ఆవిష్కరించారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్

గండేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ మూడే వినాయక్‌కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. పండ్ల తోటల కోసం ట్రాక్టర్ మౌంటెడ్ రౌండ్ బేసిన్ మేకర్ కమ్ ఫర్టిలైజర్ అప్లికేటర్ అనే అంశంపై ఆయన సమర్పించిన థీసిస్‌కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు ఆంధ్రప్రదేశ్ ఇటీవల డాక్టరేట్ ప్రకటించినట్లు ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. వినాయక్‌ను ఆదిత్య చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, ఎస్.సతీష్‌రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రమాశ్రీ అభినందించారు.

'బీసీలకు ప్రత్యేక గుర్తింపు'

రౌతులపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొప్పుల వెలమ కులస్తులకు గుర్తింపు నిచ్చింది టీడీపీ ప్రభుత్వమేనని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. టీడీపీలో బీసీలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా మూడుగలకు చెందిన పివిజి కుమార్ నియామకంపై వారితో పాటు మండల కొప్పుల వెలమ నాయకులు చింతకాయల రాజు, పాశిల సూర్యనారాయణ, పల్లికుమార్, గొల్లు పెద్దదివాణం, కోరుప్రోలు బుజ్జీబాబు నాయుడు, పైల పైడిరాజు, రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

రౌతులపూడిలో కారు చోరీ

రౌతులపూడి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామ శివారు ఉన్న షెడ్‌లో నుంచి దొంగలు కారును ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన కోరుప్రోలు లోవరాజుకు చెందిన హుందాయి వెన్యూ ఏపి 40ఇ 6096 ఇంజన్ ఆయిల్ మార్చడానికి షెడ్‌కు తీసుకెళ్లగా దొంగిలించారు. కోరుప్రోలు లోవకుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.